మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

మంగళవారం 20 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 319

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District





## సింగపూర్‌లో పడిపోతున్న జననాల రేటు

- ప్రభుత్వమే రంగంలోకి.. ఉద్యోగుల కోసం డేటింగ్ యాప్
- గత ఏడాది 30 వేలలోపే జననాలు
- పెరుగుతున్న అవివాహితుల సంఖ్యతో ఆందోళన
- 21 నుంచి 35 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఫస్ట్ డేట్
- అభిరుచులు, జీవనశైలి ఆధారంగా జోడీల ఎంపిక
- ఇద్దరికీ నచ్చితే పెళ్లి దిశగా అడుగులు

03

సింగపూర్‌లో తగ్గుతున్న జననాల రేటును అరికట్టేందుకు ప్రభుత్వం వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. యువతీ యువకులు తమకు నచ్చిన జీవిత భాగస్వామిని ఎంచుకునేందుకు 'ఫస్ట్ డేట్' పేరుతో డేటింగ్ యాప్‌ను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూపొందించిన ఈ యాప్.. అభిరుచులు, ఆసక్తులు, జీవనశైలి ఆధారంగా తగిన జోడీని సూచించనుంది. 2025లో దేశంలో జననాల సంఖ్య 30 వేలలోపే నమోదవడంతో ఆందోళన చెందుతున్న ప్రభుత్వం.. యువత పరిచయాలు పెంచుకుని వివాహ బంధాల వైపు అడుగులు వేసేందుకు ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. అయితే ఈ ప్రయోగం వివాహాలు, జననాల రేటుపై ఎంతవరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.






పాఠకులకు , ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు

విజయదశమి
శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా మంగళవారం మా కార్యాలయానికి సెలవు. బుధవారం సంచిక రాదు . పునర్దర్శనం గురువారం


### స్థానిక సంస్థల్లోనూ కూటమికి

# జై కొట్టండి



**స్థానిక సంస్థల్లో ఎన్డీఏ గెలిస్తే అభివృద్ధికి మరింత ఊతం**

- మేం విద్యాధికులను నిలబెట్టాం... వాళ్లు విధ్వంసకారులను ఎంపిక చేశారు
- అన్ని వర్గాలకూ చోటు కల్పిస్తూ అభ్యర్థుల ఎంపిక... బీసీలకు అత్యధిక ప్రాధాన్యత
- నాడు పులివెందులలో నామినేషన్లు వేయనీయలేదు... నేడు కుప్పం, పిఠాపురంలో స్వేచ్ఛగా నామినేషన్లు
- గొడ్డలి పార్టీ చేసిన అవినీతి, అక్రమాల నుంచి జెన్-జీ కాపాడాలా...?
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- స్థానిక ఎన్నికల్లో నాడు-నేడు వైసీపీ అరాచకాల వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి

అమరావతి,

స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రంలో అభివృద్ధి మరింత వేగంగా సాగుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల్లో ఒకే కూటమి అధికారంలో ఉంటే అభివృద్ధి పనులు వేగంగా పూర్తవుతాయని పేర్కొన్నారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యమిచ్చామని, విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికి అవకాశాలు కల్పించామని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కలిపి 63.6 శాతం స్థానాలు కేటాయించామని, బీసీలకు 35 శాతానికి పైగా


-మిగతా 3 లో




## కేంద్ర బలగాలను దించాలని ఆదేశించలేం

- వైసీపీ అప్పీల్‌ను కొట్టివేసిన హైకోర్టు
- 'స్థానికం'గా ఆరేడు ఘటనల ఆధారంగా కేంద్ర బలగాలను కోరలేరు
- సమస్యాత్మక ప్రాంతాల్లో 32.5 ప్లాటూన్ల అదనపు బలగాలు
- అవసరాన్ని బట్టి మరిన్ని మోహరించే అధికారం ఎస్ఈసీకి ఉంది: ఏజీ

అమరావతి,

స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాల మోహరింపునకు ఆదేశాలు ఇవ్వలేమని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వైసీపీ దాఖలు చేసిన అప్పీల్‌ను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. రాష్ట్రంలో జరిగిన ఆరేడు ఘటనల ఆధారంగా కేంద్ర బలగాల మోహరింపును పిటిషనర్ కోరలేరన్న రాష్ట్రప్రభుత్వ వాదనను పరిగణనలోకి తీసుకుంది. పశ్చిమ బెంగాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో కేంద్ర బలగాలు మోహరించాయని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది వాదిస్తున్నారని.. ఆ రాష్ట్ర పరిస్థితులతో ఏపీ పరిస్థితులను పోల్చిచూడలేమని సింగిల్ జడ్జి స్పష్టంగా చెప్పారని గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో అప్పీల్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ ఆలపాటి గిరిధర్‌తో కూడిన ధర్మాసనం


-మిగతా 3 లో


## సీజేపీ నేతల కస్టడీ పొడిగింపు




## మణిపూర్‌లో మళ్లీ రక్తపాతం..

- నలుగురి మృతి, పలువురికి గాయాలు
- సంగీత కార్యక్రమం సందర్భంగా రాళ్లదాడి, కాల్పులు
- కాల్పుల్లో 24 ఏళ్ల యువకుడు మృతి
- ఖమెన్‌లోక్ కొండల్లో ముగ్గురు గ్రామస్థుల హత్య
- గిరిజన మిలిటెంట్లుగా అనుమానిస్తున్న వ్యక్తులపై ఆరోపణలు
- ముఖ్యమంత్రి నివాసం ఎదుట మృతదేహాలతో నిరసన
- ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసుల లాఠీచార్జ్
- బాష్పవాయువు ప్రయోగంతో ఇంఫాల్‌లో ఉద్రిక్తత




### ప్రపంచంలోని అత్యంత టాప్-20

## కాలుష్య నగరాల్లో 13 భారత్‌లోనే

- మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్
- 198 ఏక్యూఐతో ఆందోళనకరంగా గాలి నాణ్యత
- నాలుగో స్థానంలో త్రిపుర రాజధాని అగర్తల
- పాలి, ముజఫర్‌నగర్, బుర్హాన్‌పూర్‌లోనూ అధిక కాలుష్యం
- ముంబైలో 167గా నమోదైన వాయు నాణ్యత సూచీ
- ప్రపంచంలో తొలి రెండు స్థానాల్లో ఇండోనేషియా నగరాలు
- టాప్-20లో లేకున్నా ఢిల్లీలోనూ ఆందోళనకర పరిస్థితులు




### తెలంగాణపై

# ఎల్‌నినో ఎఫెక్ట్

**పొదుపు బాటలో ప్రభుత్వం!**

- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల వాడకంపై ఆంక్షలు విధింపు
- పరిశ్రమలకు విద్యుత్ కోతలు ఉండవని స్పష్టం చేసిన సర్కార్
- తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, కార్యాచరణ
- హైదరాబాద్‌లో అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక డ్రైవ్




హైదరాబాద్,

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో విద్యుత్, నీటి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పొదుపు చర్యలపై దృష్టి సారించింది. విద్యుత్ ఉత్పత్తి, నీటి లభ్యతపై ఒత్తిడి పెరగకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ఆదేశించింది. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో


-మిగతా 3 లో





### అమెరికాలోని ప్రతి బిడ్డకు

## స్పేస్‌ఎక్స్ షేర్!

- వచ్చే ఏడాది పంపిణీ చేస్తానన్న ఎలాన్ మస్క్
- సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ప్రకటన
- ఒక్కో షేరు విలువ సుమారు రూ.14 వేలు
- అమెరికాలో 7.20 కోట్ల మంది పిల్లలు ఉన్నట్లు అంచనా
- మొత్తం వాటాల విలువ రూ.లక్ష కోట్ల వరకు ఉండే అవకాశం
- ఎవరికి వర్తిస్తుంది? అర్హతలపై స్పష్టత కరువు
- షేర్ల బదిలీ, దరఖాస్తు విధానంపై వెల్లడి కాని వివరాలు
- పౌరసత్వం, వయోపరిమితిపై కొనసాగుతున్న సందేహాలు



## శ్రీశైలంలో వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దంపతులు



**శ్రీశైలం, అక్టోబర్ 19 (డ్రీమ్ టైమ్స్):** శ్రీశైలం మహాక్షేత్రంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దంపతులు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దంపతులు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ రాజగోపురం వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు. తొమ్మిదవ రోజు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సిద్ధిదయిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు కైలాస వాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దంపతులు, దేవస్థానం చైర్మన్ పోతుకుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కుట్రపూరితంగా విపక్షాలను ఓట్లను తొలగిస్తున్నది : అఖిలేష్ యాదవ్



**న్యూఢిల్లీ: అక్టోబర్19 డ్రీమ్స్ టైమ్స్**

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బీజేపీ పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుట్రపూరితంగా ఓటర్ల జాబితాను తారుమారు చేస్తోందని, దొంగ ఓట్లను చేర్పించడంతోపాటు ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తోందని ఆయన విమర్శించారు. లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద పార్టీ కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అవకతవకలు గుర్తిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని అఖిలేష్ సూచించారు. మోసం, నిజాయతీ లేకపోవడాన్నే బీజేపీ తన బలంగా భావిస్తున్నదని, అందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని అఖిలేశ్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రకటించిన తర్వాత అఖిలేశ్ ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవలే వేల కోట్లు ఖర్చుపెట్టి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్తిచేసిన తర్వాత మళ్లీ ఇప్పుడు ఎూ= అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం బీజేపీకి అనుకూలంగా జాబితాను మార్చేందుకేనని ఆయన ఆరోపించారు.

## అమెజాన్‌లో మళ్లీ ఉద్యోగాల కోత?

**5 వేల మందిపై వేటు!**




**న్యూఢిల్లీ: అక్టోబర్19 డ్రీమ్స్ టైమ్స్**

ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ మళ్లీ ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రతిపాదిత డెలివరీ ప్రొటెక్షన్ చట్టం అమల్లోకి వస్తే, సుమారు 5 వేల మంది డెలివరీ ఉద్యోగులను తొలగించడంతోపాటు 15 గోదాములను మూసివేయవచ్చని సమాచారం. గోదాముల మూసివేత వల్ల మరో 2 వేల మంది ఉద్యోగులపై ప్రభావం పడే అవకాశం ఉందని న్యూయార్క్ పోస్ట్ కథనం వెల్లడించింది. అయితే, ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం వెలువడలేదు.న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ మద్దతిస్తున్న ఈ బిల్లు ప్రకారం, ప్రస్తుతం 40 థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ల ద్వారా పనిచేస్తున్న 5 వేల మందికిపైగా డెలివరీ సిబ్బందిని అమెజాన్ నేరుగా ఉద్యోగులుగా నియమించుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధన అమల్లోకి వస్తే తన డెలివరీ వ్యవస్థను మార్చుకోవాల్సి వస్తుందని, అందులో భాగంగా ఉద్యోగాల కోత, గోదాముల మూసివేత వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని కథనం పేర్కొన్నది.

## టన్నెల్ బోరింగ్ యంత్రాల ఎగుమతులపై చైనా ఆంక్షలు

**భారత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం**



**బీజింగ్: అక్టోబర్19 డ్రీమ్స్ టైమ్స్**

భారత్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రభావం చూపే కీలక యంత్రాల ఎగుమతులపై చైనా సోమవారం కొత్త ఆంక్షలు ప్రకటించింది. వీటిలో సొరంగాల తవ్వకానికి ఉపయోగించే టన్నెల్ బోరింగ్ యంత్రాలు కూడా ఉన్నాయి. జాతీయ భద్రత, ప్రయోజనాల పరిరక్షణ కోసమే ఈ నియంత్రణలు విధిస్తున్నట్టు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఆంక్షలు నవంబర్ 18 నుంచి అమల్లోకి రానున్నాయి.ఈ నిర్ణయం భారత్‌లో నిర్మాణంలో ఉన్న భూగర్భ మెట్రో రైలు మార్గాలు, హైస్పీడ్ రైల్వే లైన్లు, వివిధ ప్రాంతాల్లోని సొరంగాల నిర్మాణ ప్రాజెక్టులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో చేపడుతున్న సొరంగాల నిర్మాణానికి అవసరమైన యంత్రాల లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. టీబీఎంల ఎగుమతులపై చైనా గత కొన్నేండ్లుగా భారత్‌కు ఆంక్షలు విధిస్తున్నది. కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో పనిచేసే వాకింగ్ ఎక్స్‌కవేటర్లు, ఎత్తైన పీఠభూమి ప్రాంతాల్లో ఉపయోగించే వెట్ షాట్‌క్రీట్ యంత్రాల ఎగుమతిపైనా చైనా ఆంక్షలు విధించింది.

## టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసు.. ముగ్గురు నిందితుల అరెస్ట్

**ముంబై/కోటా,అక్టోబర్19 డ్రీమ్స్ టైమ్స్**



బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులకు పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు సోమవారం రాజస్థాన్‌లోని కోటా రైల్వేస్టేషన్‌లో అరెస్ట్ చేశారు. నిందితులు ముంబై నుంచి నేపాల్‌కు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్టు గుర్తించారు. బీహార్‌లోని బెగుసరాయ్‌కి చెందిన రితిక్ అలియాస్ రోషన్, హర్యానాలోని సోనిపట్‌కు చెందిన రెహాన్ సహా ముగ్గురిని కోటా స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నట్టు కోటా ఎస్పీ తేజస్విణి గౌతమ్ తెలిపారు.రెహాన్‌కు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్న అనిల్ పండిట్‌తో పరిచయం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అనిల్ పండిట్ ఈ దాడికి సంబంధించి మాట్లాడినట్టున్న ఓ ఆడియో క్లిప్ వైరల్‌గా మారింది

# పారిస్‌లో 350 మందికిపైగా అరెస్టు..

**- అల్లర్లను నియంత్రించలేకపోయామన్న మంత్రి**



**పారిస్ అక్టోబర్19 డ్రీమ్స్ టైమ్స్**

ఫ్రాన్స్‌లో ఆదివారం జరిగిన విధ్వంసం .. ఆ దేశ చరిత్రలో చేదు గుర్తుగా మిగిలిపోయింది. అయితే పారిస్‌లో ఇప్పటి వరకు సుమారు 350 మంది నిరసనకారుల్ని అరెస్టు చేశారు. పారిస్‌తో పాటు ఇతర నగరాల్లో జరిగిన నిరసన ప్రదర్శన వేళ.. ఆందోళనకారుల్ని పోలీసులు నియంత్రించలేకపోయినట్లు హోంమంత్రి లారెంట్ నునేజ్ తెలిపారు. అల్లర్లు, హింసను అంచనా వేయలేకపోయినట్లు ఆయన చెప్పారు. ఆదివారం జరిగిన హింస నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. కానీ మాక్రన్ ఆ రాజీనామాను అంగీకరించలేదని తెలిసింది.దేశవ్యాప్తంగా పాఠశాల్లో అధ్వాన్న పరిస్థితులు ఉన్నాయని, పెరిగే ధరల వల్ల రోజువారీ బ్రతుకు జీవనం కఠినంగా సాగుతున్నట్లు గత కొన్ని రోజుల నుంచి ఫ్రాన్స్‌లో ఆందోళనలు జరుగుతున్నాయి. అయితే వారాంతం వేళ సుమారు అయిదున్నర లక్షల మంది వరకు భారీ నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చారు. ఫ్రాన్స్‌లోని ముఖ్యమైన నగరాల్లో ఆ ఆందోళనలు జరిగాయి. కొందరు నిరసనకారులు విధ్వంసానికి దిగారు. సుమారు 1500 షాపులను, వ్యాపార కేంద్రాలను లూటీ చేసి ధ్వంసం చేశారు. వాస్తవానికి సెప్టెంబర్‌లో విద్యా ప్రమాణాలు పెంచాలని విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. స్కూల్ బిల్డింగ్‌లు క్షీణదశలో ఉన్నాయని, టీచర్ల కొరత ఉన్నట్లు విద్యార్థులు ఆరోపించారు. అన్ని నగరాలకు ఆ ఆందోళన పాకింది. కొన్ని చోట్ల హింసకు దారి తీసింది. అక్టోబర్ 5వ తేదీన జరిగిన నిరసనలో 15 ఏళ్ల విద్యార్థి చేయికి తీవ్రగాయమైంది. టీచర్లు, పెన్షనర్లు, వివిధ సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాయి. తొలుత ఆందోళనలు శాంతియుతంగా సాగాయి. కానీ ఆ తర్వాత కాస్త వేడెక్కాయి. మరోవైపు ఫ్రాన్స్‌లో దేశాధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరో ఆరు నెలల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడనున్నది. వచ్చే మే నెలలో జరిగే ఎన్నికల కోసం ఫ్రాన్స్ వీధుల్లోనే ప్రచారం మొదలైనట్లు కొందరు ఆరోపిస్తున్నారు. కానీ ఆదివారం జరిగిన ఘటన పట్ల మంత్రి లారెంట్ నునేజ్ కారణం వెల్లడించే ప్రయత్నం చేశారు. హింసకు బాధ్యుడిగా భావిస్తూ రాజీనామా చేసినట్లు చెప్పారు. కానీ ఆ రాజీనామాను మాక్రన్ తిరస్కరించినట్లు ఎలిసీ ప్యాలెస్ వర్గాలు పేర్కొన్నాయి. సుమారు 2 లక్షల మంది వరకు నిరసనల్లో పాల్గొంటారని అంచనా వేశామని, కానీ ఆ సంఖ్య 5 లక్షలు దాటిందని నునేజ్ అన్నారు. తాము తీసుకున్న భద్రతా చర్యలు సరిపోలేదన్నారు. పారిస్, లియాన్, మారిసెల్లీలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయలేకపోయినట్లు ఆ నగరాల మేయర్లు తెలిపారు. లూటీలు ఎందుకు జరిగాయో అర్థం కావడం లేదని, సుమారు 30 నిమిషాల పాటు లూటీ జరుగుతుంటే పోలీసులు ఏమీ చేయలేకపోయినట్లు మేయర్లు ఆరోపించారు. సమస్య పరిష్కారానికి హై స్కూల్ విద్యార్థులతో మీటింగ్ నిర్వహించాలని మేయర్లు అభిప్రాయపడ్డారు. జనసమీకరణపై మారిసెల్లీలో ప్రస్తుతం తాత్కాలిక బ్యాన్ విధించారు.

# అమెరికా భావి అధ్యక్షుడు మనకు శత్రువు కావచ్చు..

**- భారత్ చిన్న దేశమేమీ కాదు : నెతన్యాహు**



**న్యూఢిల్లీ: అక్టోబర్19 డ్రీమ్స్ టైమ్స్**

భవిష్యత్ అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయెల్ కు శ త్రువు కావచ్చునని ఆ దేశ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. ఈ తరుణంలో భారత్ , లాటిన్ అమెరికా వంటి బలమైన దేశాలతో పొత్తు పెట్టుకోవాలని నెతన్యాహు తన అధికారులకు పిలుపునిచ్చారు. స్థానిక మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. అక్టోబర్ 27న ఇజ్రాయెల్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.మీడియా కథనాల ప్రకారం.. మరో రెండేళ్లలో ఇజ్రాయెల్ పట్ల శత్రుభావంతో ఉండే వ్యక్తి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టవచ్చునని, వారు పురుషుడు లేదా మహిళ ఎవరైనా కావచ్చునని, మీరు దానిని ఎలా ఎదుర్కొంటారు..? అని అధికారులను ఉద్దేశించి నెతన్యాహు ప్రశ్నించారు. అగ్రరాజ్యంతో సంబంధాలు ఎలా నిర్వహిస్తారని అడిగారు. అమెరికా విధానంలో సంభవించే పెద్ద మార్పుకు సిద్ధమవుతూ.. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న రోజుల్లోనే ఇజ్రాయెల్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. వచ్చే రెండేళ్లలోనే అమెరికా సాయంతో చేయగలిగినదంతా చేయాలని నెతన్యాహు అన్నారు. అదే సమయంలో భవిష్యత్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మరిన్ని దేశాలతో సంబంధాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కూటములను ఏర్పాటు చేసుకోవాలని, ఇప్పుడు తాను అదే పని చేస్తున్నానని అన్నారు. భారత్ చిన్న దేశమేమీ కాదని, అలాగే లాటిన్ అమెరికా, బ్రెజిల్‌లలో త్వరలో భారీ మార్పులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కూటముల సంఖ్యను విస్తరించుకోవాలని, విలువ పెంచే సామర్థ్యాలను వృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, దేశంలో ఎన్నికలకు ముందు ఇజ్రాయెల్ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన ప్రధాన ప్రత్యర్థి అయిన గాడి ఐసెన్‌కోట్ తప్పుబట్టారు. ఇతర దేశాల పేరు చెప్పి నెతన్యాహు ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

# కుర్సియాంగ్ అడవుల్లో మరో నల్లజింక ప్రత్యక్షం..

**పరవశించిన పర్యాటకులు..!**



**న్యూఢిల్లీ: అక్టోబర్19 డ్రీమ్స్ టైమ్స్**

పశ్చిమబెంగాల్ లోని కుర్సియాంగ్ అడవుల్లో మరో నల్లజింక ప్రత్యక్షమైంది. ఈ ఏడాది జనవరిలో ఒక నల్లజింక కనపడి అబ్బురపర్చగా.. ఇప్పుడు మరో నల్లజింక దర్శనమిచ్చింది. దుర్గాపూజ సీజన్ కావడంతో ప్రస్తుతం పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్, కుర్సియాంగ్ ప్రాంతాలు పర్యటకులతో కళకళలాడుతున్నాయి. ఈ క్రమంలో ఓ పర్యాటకుడికి 'పర్వతాల రాణి' గా పేరున్న కుర్సియాంగ్‌లోని దట్టమైన అడవుల్లో అరుదైన దృశ్యం కనిపించింది.కుర్సియాంగ్ అడవుల్లో పైన్ చెట్లతో నిండిన 'డౌ హిల్' ఏరియాలో అత్యంత అరుదైన నల్లని జింక దర్శనమిచ్చింది. ఈ ఏడాది ప్రారంభంలో కూడా కుర్సియాంగ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ దేబేశ్ పాండే డౌ హిల్ ఏరియాలో ఇలాంటి జింకను మొదటిసారి గుర్తించి కెమెరాలో బంధించారు. తాజాగా అదే ప్రాంతంలో ట్రెక్కింగ్ చేస్తున్న ఒక టూరిస్ట్ మరో నల్ల జింకను చూశారు. ఓ టూరిస్ట్ బృందం ప్రకృతిని ఆస్వాదిస్తూ 'డౌ హిల్' అడవుల్లో నడుస్తుండగా వారిలో ఒకరికి హఠాత్తుగా నల్లని రంగులో ఉన్న జింక కనిపించింది. ఆ అద్భుత దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయిన సదరు పర్యటకుడు వెంటనే దాని ఫొటోలను తీశాడు. జింక కనిపించిన సమయంలో ఆ ప్రాంతంలో ఉన్న పర్యాటకులు అరుదైన నల్లజింకను చూస్తూ ఆనందంతో పరవశించిపోయారు. జన్యుపరమైన మార్పులవల్ల అత్యంత అరుదుగా కొన్ని జంతువుల శరీరంలో 'మెలనిన్' అనే వర్ణద్రవ్యం అధికమవుతుందని, దాంతో అవి నల్లగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. చిరుత శరీరంలో మెలనిన్ పెరిగి అది 'బ్లాక్ పాంథర్' గా మారినట్లే, 'బార్కింగ్ డీర్' జాతికి చెందిన జింకల్లో కూడా ఇలాంటి మార్పులు సంభవించి అవి పూర్తిగా నల్లగా కనిపిస్తాయి. ఇలాంటి అరుదైన జన్యుమార్పు పది లక్షల జంతువులలో ఒకదానికి మాత్రమే సంభవిస్తుంది. గతంలో అటవీ శాఖ నిర్వహించిన పరిశోధనల్లో కూడా ఇలాంటి నల్లని జింకల ఉనికి గురించి కనుగొన్నారు. అంతేకాకుండా ఇటీవలి సంవత్సరాలలో 'డౌ హిల్', 'బగోరా', 'మిరిక్' లోని విస్తారమైన కొండ ప్రాంతాలలో నల్లని చిరుత పులులు సంచరించినట్లు అనేకసార్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. అయితే పూర్తిగా నల్లగా ఉండే ఒక జింక ఈ విధంగా బహిరంగంగా సంచరించడం మునుపెన్నడూ జరగలేదు. వరుసగా నల్ల జింకలు కనిపించడంపై కుర్సియాంగ్ అటవీ విభాగం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ దేబేశ్ పాండే సంతోషం వ్యక్తంచేశారు. ఇది రాష్ట్ర అటవీ శాఖకు, వన్యప్రాణి ప్రేమికులందరికీ ఎంతో గర్వకారణమన్నారు. ఈ అడవులలో ఇంతకుముందు కూడా అరుదైన నల్ల జింకలు కనిపించినప్పటికీ, బహిరంగ ప్రదేశంలో ఒక నల్ల జింక కనిపించడం ఇదే మొదటిసారని అన్నారు.

# జమ్ముకశ్మీర్ బస్సుపై రాళ్లతో దాడి..

**- డ్రైవర్‌ను ఉగ్రవాదిగా పేర్కొన్న వ్యక్తులు**




**న్యూఢిల్లీ: అక్టోబర్19 డ్రీమ్స్ టైమ్స్**

జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుపై ఇద్దరు వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. ఆ బస్సు డ్రైవర్‌ను ఉగ్రవాదిగా పేర్కొన్నారు. ఉగ్రవాద వాహనానికి నిప్పుపెడతామని, ప్రయాణికులను చంపుతామని వారు బెదిరించారు. ఈ దాడిలో బస్సు అద్దాలు ధ్వంసం కావడంతో ఒక ప్రయాణికుడు గాయపడ్డాడు. అక్టోబర్ 17న రాత్రి 10.30 గంటల సమయంలో ఢిల్లీ నుంచి శ్రీనగర్ వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ప్రయాణికుల భోజనం కోసం హర్యానాలోని కర్నాల్ జిల్లాలో ఒక ధాబా వద్ద ఆగింది. అక్కడ ఒక కారు కూడా పార్క్ చేసి ఉన్నది.కాగా, ఆ కారులోని ఇద్దరు వ్యక్తులు, బస్సు ప్రయాణికుడి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్ రిజిస్ట్రేషన్ ఉన్న బస్సును ఉగ్రవాద వాహనంగా, డ్రైవర్‌ను ఉగ్రవాదిగా వారు పేర్కొన్నారు. 'ఈ ఉగ్రవాద వాహనాన్ని ఇక్కడి నుంచి తీసివేయండి' అని అరిచారు. ఆ బస్సు అక్కడి నుంచి వెళ్లిపోవాలని వారు డిమాండ్ చేశారు. అయితే బస్సు డ్రైవర్ ప్రశ్నించగా ఆ ఇద్దరు వ్యక్తులు మరింతగా రెచ్చిపోయారు. బస్సుపైకి రాళ్లు, ఇటుకలు విసిరారు. బస్సులోని వారిని కాల్చివేస్తామని, బస్సుకు నిప్పు పెడతామని, వారిని చంపేస్తామని బెదిరించారు. జమ్ముకశ్మీర్ రిజిస్ట్రేషన్ ఉన్న వాహనం హర్యానాలో ఉండటాన్ని మరికొందరు వ్యతిరేకించారు. ఈ రాళ్ల దాడిలో బస్సు కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. వృద్ధుడైన ఒక ప్రయాణికుడు గాయపడ్డాడు. ఈ సంఘటన తర్వాత ఆ బస్సు అక్కడి నుంచి బయలుదేరింది.

# మణిపూర్‌లో మళ్లీ రక్తపాతం..

**-నలుగురి మృతి, పలువురికి గాయాలు**
**-సంగీత కార్యక్రమం సందర్భంగా రాళ్లదాడి, కాల్పులు**
**-కాల్పుల్లో 24 ఏళ్ల యువకుడు మృతి**
**-ఖమెన్‌లోక్ కొండల్లో ముగ్గురు గ్రామస్థుల హత్య**
**-గిరిజన మిలిటెంట్లుగా అనుమానిస్తున్న వ్యక్తులపై ఆరోపణలు**
**- ముఖ్యమంత్రి నివాసం ఎదుట మృతదేహాలతో నిరసన**
**-ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసుల లాఠీచార్జ్**
**--బాష్పవాయువు ప్రయోగంతో ఇంఫాల్‌లో ఉద్రిక్తత**



ఇంఫాల్, అక్టోబర్ 19: తాజా హింసాత్మక ఘటనలతో మణిపూర్‌లో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఈ హత్యలపై ఆగ్రహించిన స్థానికులు నిరసనలకు దిగడంతో ఇంఫాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు రెండు మృతదేహాలను ముఖ్యమంత్రి నివాసం ఎదుట ఉంచగా, అధికారులు వాటిని అక్కడి నుంచి తొలగించారు. మొదటి ఘటన మైతీలు, పాంగల్ ముస్లింలు నివసించే ప్రాంతంలో జరిగిన సంగీత కార్యక్రమం సందర్భంగా చోటుచేసుకుంది. ఈ సమయంలో రాళ్లదాడి, కాల్పులు జరగడంతో పలువురు గాయపడ్డారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన 24 ఏళ్ల యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖమెన్‌లోక్‌లో మరో ఘటన జరిగింది. సమీపంలోని కొండల్లోకి కట్టెల కోసం వెళ్లిన ముగ్గురు గ్రామస్థులను గిరిజన మిలిటెంట్లుగా అనుమానిస్తున్న వ్యక్తులు కాల్చి చంపినట్లు సమాచారం. ఈ దాడిలో మరో ముగ్గురు గాయపడ్డారు. ఆ ప్రాంతంలో కుకీ మిలిటెంట్ గ్రూపు ఉనికి ఉన్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. వరుస హత్యలతో ఆగ్రహించిన గ్రామస్థులు మృతదేహాలను తీసుకుని ఇంఫాల్‌లోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్నారు. లోపలకు చొరబడి మృతదేహాలను అక్కడ ఉంచడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీచార్జ్ చేశారు. తాజా ఘటనలతో ఇంఫాల్ నగరంలో సాధారణ జనజీవనం స్తంభించినట్లు సమాచారం.

# సీజేపీ నేతల కస్టడీ పొడిగింపు

**21వ తేదీకి విచారణ వాయిదా**




న్యూఢిల్లీ, అక్టోబర్ 19
కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నాయకులు ఆశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ మరో రెండు రోజులు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. వారి విడుదల కోసం సీజేపీ న్యాయబృందం పూచీకత్తులను సమర్పించిన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. తదుపరి విచారణను ఈనెల 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. దాస్, రాంకాలను జ్యుడీషియల్ కస్టడీ నుంచి విడుదల చేయాలని కోరుతూ సీజేపీ న్యాయ బృందం స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు ఒక దరఖాస్తును దాఖలు చేసింది.వారిని నిర్బంధించిన రోజున వారి పూచీదారులు అందుబాటులో లేకపోవడంతో మొదట వారిని కస్టడీకి పంపారు. న్యాయబృందం ఇప్పుడు పూచీకత్తు పత్రాలను రికార్డులో దాఖలు చేసి వారి విడుదలను అభ్యర్థించింది. జంతర్ మంతర్‌ను నిర్దేశిత నిరసన ప్రదేశం జాబితా నుంచి తొలగించిన ఒక రోజు తర్వాత ఆ ప్రదేశంలోకి ప్రవేశించినందుకు ఢిల్లీ పోలీసులు దాస్, రాంకాలను ఈనెల 13న అదుపులోకి తీసుకుని 14న ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు.

# కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

మొదటి తరువాయి

సోమ భరత్ కుమార్ వీటిని జారీ చేశారు.

**కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు**

కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది.

**సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టులను వెంటనే తొలగించాలి**

తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది.నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయ పరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది

# అమెరికాలోని ప్రతి బిడ్డకు స్పేస్‌ఎక్స్ షేర్!



న్యూఢిల్లీ
ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ వచ్చే ఏడాది అమెరికాలోని ప్రతి బిడ్డకు తన రాకెట్ తయారీ సంస్థ స్పేస్‌ఎక్స్‌లో ఒక వాటాను బహుమతిగా ఇవ్వనున్నారు. తన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఈ విషయాన్ని సోమవారం మస్క్ ప్రకటించారు. స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఒక షేర్ విలువ 146 డాలర్లు అంటే సుమారు రూ.14,000గా ఉంది. అమెరికాలో సుమారు 7.20 కోట్ల మంది పిల్లలు ఉన్నారు. తద్వారా పంపిణీ చేయాల్సిన వాటాల విలువ రూ. 1 లక్ష కోట్లు అవుతుంది. అయితే, దీనిని లక్షలాది మంది పిల్లలకు చేరవేసే ప్రక్రియ ఎలా ఉంటుందో తెలియదు. మస్క్ లేదా ఆయన కంపెనీ దీనిపై ఇప్పటివరకు ఎటువంటి సమాచారం అందించలేదు. అంతేగాక ఏ పిల్లలు ఇందుకు అర్హులు అవుతారో కూడా స్పష్టంగా తెలియదు. మస్క్ తన పోస్ట్‌లో అమెరికాలోని ప్రతి బిడ్డ గురించి ప్రస్తావించారు. అయితే దీనికి సంబంధించి కొన్ని పరిమితులు ఉన్నాయి.

# కేంద్ర బలగాలను దించాలని ఆదేశించలేం

మొదటి తరువాయి

సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.స్థానిక ఎన్నికలకు కేంద్ర బలగాలను మోహరించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ), కేంద్ర హోంశాఖను ఆదేశించాలని కోరుతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చేసిన అభ్యర్థనను సింగిల్ జడ్జి తోసిపుచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితులతో ఏపీలో పరిస్థితులను పోల్చలేమన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీటీవీ కెమేరాలు ఏర్పాటు చేయాలని, నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈసీని, పోలీసులను ఆదేశించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ అప్పిరెడ్డి దాఖలుచేసిన అప్పీల్ సోమవారం ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. నామినేషన్ల సందర్భంగా చోటు చేసుకున్న ఆరేడు ఘటనల ఆధారంగా కేంద్ర బలగాలను మోహరించాలని కోరలేరన్నారు.

# సింగపూర్‌లో పడిపోతున్న జననాల రేటు

-ప్రభుత్వమే రంగంలోకి.. ఉద్యోగుల కోసం డేటింగ్ యాప్
-గత ఏడాది 30 వేలలోపే జననాలు
-పెరుగుతున్న అవివాహితుల సంఖ్యతో ఆందోళన
-21 నుంచి 35 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఫస్ట్ డేట్
-అభిరుచులు, జీవనశైలి ఆధారంగా జోడీల ఎంపిక
-ఇద్దరికీ నచ్చితే పెళ్లి దిశగా అడుగులు



న్యూఢిల్లీ,
జననాల రేటు తగ్గిపోతుండటంతో సింగపూర్ ప్రభుత్వం కొత్త ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. యువతీ యువకులు తమకు నచ్చిన జీవిత భాగస్వామిని వెతుక్కునేందుకు 'ఫస్ట్ డేట్' పేరిట ఓ డేటింగ్ యాప్‌ను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చినట్లు నివేదికలు వెల్లడించాయి. ప్రస్తుతం 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఈ యాప్‌ను రూపొందించినట్లు సమాచారం. వివాహంపై ఆసక్తి ఉన్నవారికి వారి అభిరుచులు, హాబీలు, జీవనశైలి ఆధారంగా సరైన జోడీని సూచించడం దీని ప్రధాన ఉద్దేశం.

నానాటికీ తగ్గుతున్న జననాలు

సింగపూర్‌లో జననాల రేటు తగ్గిపోవడం ప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తోంది. 2025లో అక్కడ 30 వేల కంటే తక్కువ మంది పిల్లలు జన్మించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. జననాలు తగ్గడం, జనాభా వృద్ధాప్యం దిశగా సాగుతుండటం వంటి పరిణామాలు భవిష్యత్తులో జనాభా సమతుల్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యువత వివాహం, కుటుంబ జీవితం వైపు అడుగులు వేసేందుకు అనుకూల పరిస్థితులు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సాధారణ డేటింగ్ యాప్‌లకు భిన్నంగా ఫస్ట్ డేట్ పనిచేస్తుందని నివేదికలు చెబుతున్నాయి. ఒకేసారి పలువురితో పరిచయాలు పెంచుకునే అవకాశం కాకుండా, ఒక్కోసారి ఒకరితో మాత్రమే అనుసంధానమయ్యే విధానం ఇందులో ఉన్నట్లు సమాచారం. వినియోగదారుల అభిరుచులు, ఆసక్తులు, జీవనశైలిని పరిగణనలోకి తీసుకుని తగిన జోడీని సూచిస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వ డిజిటల్ గుర్తింపు వ్యవస్థ ద్వారా వినియోగదారులు తమ గుర్తింపును ధృవీకరించుకోవాల్సి ఉంటుంది.

ప్రభుత్వ ఉద్యోగులకే ఎందుకు?

ఈ యాప్ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. 35 ఏళ్లు దాటినవారు, ప్రైవేటు రంగంలో పనిచేసేవారు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కాలేరా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ కార్యక్రమం ప్రస్తుతం ప్రయోగాత్మక దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో దీని పరిధిని విస్తరిస్తారా లేదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. జీవిత భాగస్వామిని ఎంచుకోవడం వ్యక్తిగత నిర్ణయమైనప్పటికీ, జననాల రేటు తగ్గుతున్న నేపథ్యంలో యువతకు పరిచయ వేదికలు కల్పించేందుకు సింగపూర్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది. అయితే ఈ యాప్ ద్వారా ఎన్ని జంటలు ఏర్పడతాయి? వివాహాల సంఖ్య పెరుగుతుందా? జననాల రేటుపై ఏ మేరకు ప్రభావం చూపుతుంది? అన్నది వేచి చూడాలి. ప్రేమ, వివాహం వంటి వ్యక్తిగత అంశాల్లో ప్రభుత్వ చొరవ ఎంతవరకు ఫలిస్తుందనేది ఈ ప్రయోగం ద్వారా తేలుతుంది.

# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

మొదటి తరువాయి



సీట్లు ఇచ్చామని వెల్లడించారు. స్థానిక ఎన్నికల్లో విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ నెలకొందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కూటమి అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తుంటే వైసీపీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఓటమి చెందినా ఆ పార్టీ తీరు మారలేదని విమర్శించారు. రాష్ట్రంలో హింస, దాడులకు పాల్పడే వారిని దూరంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. దాడులు, బెదిరింపులను ప్రభుత్వపరంగా, పార్టీ పరంగా గట్టిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమ ఏకగ్రీవాలు సాధించిందని చంద్రబాబు ఆరోపించారు. 2014లో ఎంపీటీసీ స్థానాల్లో ఏకగ్రీవాలు 2 శాతం, జెడ్పీటీసీ స్థానాల్లో 0.09 శాతంగా ఉండగా, వైసీపీ పాలనలో అవి వరుసగా 24 శాతం, 19 శాతానికి పెరిగాయని గణాంకాలను ప్రస్తావించారు. ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో కుప్పం, పిఠాపురం, పులివెందుల సహా వివిధ ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులు కూడా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేశారని పేర్కొన్నారు. గత, ప్రస్తుత ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన వీడియోలను ఈ సందర్భంగా మీడియాకు ప్రదర్శించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చంద్రబాబు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. సామాజిక భద్రత పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం-2.0 వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, పెట్టుబడుల ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు.

# ప్రపంచంలోని అత్యంత టాప్-20 కాలుష్య నగరాల్లో 13 భారత్‌లోనే

-మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్
-198 ఏక్యూఐతో ఆందోళనకరంగా గాలి నాణ్యత
-నాలుగో స్థానంలో త్రిపుర రాజధాని అగర్తల
-పాలి, ముజఫర్‌నగర్, బుర్హాన్‌పూర్‌లోనూ అధిక కాలుష్యం
-ముంబైలో 167గా నమోదైన వాయు నాణ్యత సూచీ
- ప్రపంచంలో తొలి రెండు స్థానాల్లో ఇండోనేషియా నగరాలు
-టాప్-20లో లేకున్నా ఢిల్లీలోనూ ఆందోళనకర పరిస్థితులు



న్యూఢిల్లీ:
ప్రపంచంలో అత్యధిక వాయు కాలుష్యం నమోదవుతున్న టాప్-20 నగరాల్లో 13 భారతదేశానికి చెందినవి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే, దేశ రాజధాని ఢిల్లీ మాత్రం ప్రపంచ టాప్-20 జాబితాలో లేకపోవడం విశేషం. అక్టోబర్ 19న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఐక్యూ డాట్ ఇన్ వెల్లడించిన గణాంకాల ప్రకారం ఈ వివరాలు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్ లోని బులంద్ షహర్ ప్రపంచ వ్యాప్తంగా అత్యంత కాలుష్య నగరాల జాబితాలో 3వ స్థానంలో నిలిచింది. అక్కడ అమెరికా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 198గా నమోదైంది. ఇది ఆరోగ్యానికి హానికరమైన స్థాయి. త్రిపుర రాజధాని అగర్తల 181 ఏక్యూఐతో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. రాజస్థాన్ లోని పాలి, ఉత్తరప్రదేశ్ లోని ముజఫర్ నగర్, మధ్యప్రదేశ్ లోని బురాహన్ పూర్ నగరాల్లో ఎక్కువ స్థాయి 174గా నమోదైంది. హర్యానాలోని రోహతక్ లో 172, రాజస్థాన్ లోని కోటాలో 170, ముంబైలో 167, హాపూర్ లో 166, హిసార్, బికనీర్లలో 165, బరేలీలో 164 చొప్పున వాయు నాణ్యత సూచీ నమోదైంది. దీంతో ఈ నగరాలు ప్రపంచంలోని అత్యంత కాలుష్య ప్రాంతాల జాబితాలో చోటు సంపాదించాయి. ఇక, ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరంగా ఇండోనేషియా లోని పలాంగ్ కరాయ మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ ఎక్కువ 242గా నమోదైంది. ఇది తీవ్రమైన కాలుష్య స్థాయి. ఇండోనేషియాలోని పాలెంబాంగ్ 207తో రెండో స్థానంలో నిలిచింది. సంపిట్ (180) ఐదో స్థానంలో, జాంబీ (176) ఆరో స్థానంలో ఉన్నాయి. మలేషియాలోని పుత్రజయ, కౌలాలంపూర్, పెటాలింగ్ జయ నగరాలు కూడా టాప్-20లో నిలిచాయి. టాప్-20 కాలుష్య నగరాల జాబితాలో ఢిల్లీ లేకపోయినప్పటికీ, హస్తినలో వాయు కాలుష్యం ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతోంది. అక్టోబర్ 19 ఉదయం 7.31 గంటలకు ఢిల్లీలో ఏక్యూఐ గరిష్టంగా 191కి చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు అక్టోబర్ 18 సాయంత్రం 5.01 గంటలకు కనిష్టంగా 126గా నమోదైంది. అనంతరం కాలుష్య స్థాయి తగ్గుతూ అక్టోబర్ 19 మధ్యాహ్నానికి 130ల స్థాయికి చేరింది.

# తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్

మొదటి తరువాయి

పగటి వేళల్లో అత్యవసరమైతే తప్ప ఏసీలను వినియోగించవద్దని, ఉపయోగించినప్పుడు 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్దే ఉంచాలని సూచించారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఏసీల వాడకాన్ని గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో లేకున్నా వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా సరఫరా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.
పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్ కోతలు విధించడం లేదని, పారిశ్రామిక యాజమాన్యాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించింది.
ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంజయ్ జాజు తెలిపారు. ఈ అంశాలపై త్వరలో అఖిలపక్ష సమావేశం, కేబినెట్ ఉపసంఘం సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
స్థానిక నీటి వనరుల నుంచి వ్యవసాయ అవసరాల కోసం అక్రమంగా మోటార్ల ద్వారా నీటిని తోడటంతో విద్యుత్ లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయని ఇంధన శాఖ అధికారులు వివరించారు. మంజీరా, సింగూరు రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత తగ్గడంతో అక్కడి నుంచి అందాల్సిన 110 మిలియన్ గ్యాలన్ల నీటిని మిషన్ భగీరథ, కృష్ణా నది తదితర ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు.
హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలకు తప్ప నిర్మాణాలు, ఇతర పనుల కోసం కొత్త బోర్లు తవ్వేందుకు అనుమతులు మంజూరు చేయవద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ స్పష్టం చేశారు. మున్సిపల్ నల్లా కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడుతున్న వారిపై హైడ్రా సహకారంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
నవంబర్ 1 నుంచి నిర్మాణ అవసరాలకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన మురుగునీటిని సరఫరా చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గుతున్నాయని, తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలను అమలు చేస్తున్నామని మరో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు.

## సంపాదకీయం

# వ్యర్థాలతో అనర్థాలు



అరచేతిలో ప్రపంచం.. అడుగడుగునా సాంకేతికత.. నిమిషాల్లో సమాచార మార్పిడి.. క్షణాల్లో పనుల పూర్తి! ఇదీ నేటి డిజిటల్ యుగం తీరు. ఒకప్పుడు విలాస వస్తువులుగా ఉన్న సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు నేడు ప్రతి ఇంటి అవసరాలుగా మారాయి. సాంకేతికత పెరిగింది.. సౌకర్యాలు పెరిగాయి.. జీవితం వేగం పుంజుకుంది. కానీ, ఈ అభివృద్ధి వెనుక మరో ముప్పు నిశ్శబ్దంగా పొంచి ఉంది. అదే ఈ -వ్యర్థాల సమస్య! సాంకేతిక పరికరాలను తరచూ మార్చుకోవాలనే ఆసక్తి, కొత్త మోడళ్లపై మోజు, మరమ్మతులు చేయించుకోవడం కంటే కొత్త పరికరాలు కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ- వ్యర్థాలు పెరగడానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. దీనికి తోడు పాత ఎలక్ట్రానిక్ పరికరాలను ఎలా సేకరించాలి? ఎక్కడ అప్పగించాలి? అనే విషయాలపై ప్రజల్లో తగిన అవగాహన లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా కోట్ల టన్నుల ఈ- వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని సక్రమంగా సేకరించి, శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయకపోతే పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఎలక్ట్రానిక్ పరికరాల్లో సీసం, పాదరసం, కాడ్మియం వంటి హానికర పదార్థాలు ఉంటాయి. వీటిని సాధారణ చెత్తతో కలిపి పారేయడం, బహిరంగంగా కాల్చడం వల్ల నేల, నీరు, గాలి కలుషితమయ్యే ప్రమాదం ఉంది .ఈ కాలుష్యం మానవ ఆరోగ్యంపై, ముఖ్యంగా నాడీ వ్యవస్థ, మూత్రపిండాలు, శ్వాసకోశంపై ప్రతికూల ప్రభావాలు చూపవచ్చు. అందుకే ఈ -వ్యర్థాల నిర్వహణ కేవలం పర్యావరణ సమస్యే కాదు.. ప్రజారోగ్యానికి సంబంధించిన కీలక అంశం కూడా. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సిపిసిబి) గణాంకాల ప్రకారం, భారతదేశంలో ఈ -వ్యర్థాల ఉత్పత్తి 2023 - 24లో సుమారు 12.54 లక్షల టన్నులుగా ఉండగా, 2024 -25లో సుమారు 13.98 లక్షల టన్నులకు పెరిగింది. అంటే, ఏడాదిలోనే వ్యర్థాల పరిమాణం గణనీయంగా పెరిగింది. అదే సమయంలో సేకరణ, రీసైక్లింగ్ తదితర నిర్వహణకు సంబంధించిన నివేదిత శాతం 61.94 నుంచి 70.71 శాతానికి పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది కొంత సానుకూల పరిణామమే అయినప్పటికీ, మిగిలిన వ్యర్థాలను కూడా సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ -వ్యర్థాల నిర్వహణలో తెలంగాణ కూడా ముందడుగు వేస్తోంది. రాష్ట్రంలో నమోదైన ఈ- వ్యర్థాల రీసైక్లర్ల సంఖ్య 2023- 24లో 14 ఉండగా, 2024- 25లో 19కి పెరిగింది. హైదరాబాద్‌లో ఈ- వ్యర్థాల రీసైక్లింగ్ సాంకేతికతల అభివృద్ధికి ప్రత్యేక జవత్‌తీవ శీట జుఇఎవశ్రీశ్రీవఅషెవ ఏర్పాటు చేయడం ఈ రంగానికి పెరుగుతున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. అయితే, రీసైక్లింగ్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ప్రతి ఇంటినుంచి వ్యర్థాలు అధికారిక సేకరణ వ్యవస్థకు చేరేలా చర్యలు తీసుకోవాలి. ఈ- వ్యర్థాలు పూర్తిగా పనికిరాని చెత్తకాదు. వాటిలో బంగారం, వెండి, రాగి, అల్యూమినియం, పల్లాడియం వంటి 17 రకాల విలువైన లోహాలు ఉంటాయి. ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా వీటిని తిరిగి వెలికితీసి వినియోగించుకోవచ్చు. అలాగే కొన్ని పరికరాల్లోని భాగాలను మరమ్మతు చేసి తిరిగి ఉపయోగించవచ్చు.ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి విలువైన పదార్థాలను తిరిగి పొందడం వల్ల సర్క్యులర్ ఎకానమీకి బలమైన వనరుగా మారడంతో పాటు సహజ వనరులపై ఒత్తిడి తగ్గుతుంది కొత్త లోహాల తవ్వకం, శుద్ధి కోసం అవసరమయ్యే శక్తి, ముడిసరుకుల వినియోగాన్ని కూడా కొంత మేర తగ్గించవచ్చు.ఈ విషయాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఉదాహరణ టోక్యో ఒలింపిక్స్. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో అథ్లెట్లకు అందించిన పతకాల తయారీకి ప్రజల నుంచి సేకరించిన పాత ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి తిరిగి పొందిన లోహాలను ఉపయోగించారు. వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చవచ్చని జపాన్ ప్రపంచానికి చాటిచెప్పింది. ఇదే స్ఫూర్తితో మనమూ 'వేస్ట్ టు వెల్త్' భావనను ఆచరణలోకి తీసుకురావాలి. భారతదేశంలో ఈ -వ్యర్థాల నిర్వహణకు సంబంధించి తొలిసారిగా 2011లో నిబంధనలు తీసుకొచ్చారు. అనంతరం 2016లో కొత్త నిబంధనలు రూపొందించి, 2018లో సవరణలు చేశారు. ప్రస్తుతం ఈ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి 2022 నిబంధనలు 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లో ఉన్నాయి. ఈ నిబంధనల్లో 'విస్తరించిన ఉత్పత్తిదారుల బాధ్యతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. అంటే, ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేసే సంస్థలు వాటి వినియోగం ముగిసిన తర్వాత ఏర్పడే వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ బాధ్యతలను నిబంధనలకు అనుగుణంగా నిర్వర్తించాలి. సిపిసిబి నిర్వహించే ఈ- వ్యర్థాల ఇపిఆర్ పోర్టల్ ద్వారా సంబంధిత సంస్థల నమోదు, రీసైక్లింగ్ బాధ్యతల పర్యవేక్షణకు వ్యవస్థ ఉంది.

అయితే, చట్టాలు చేయడం ఎంత ముఖ్యమో వాటిని సమర్థంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. ప్రజలు, ఉత్పత్తిదారులు, రీసైక్లర్లు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. ఈ -వ్యర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచడంలో పాఠశాలలు, కళాశాలలు కీలక పాత్ర పోషించాలి. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల వర్గీకరణ, రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించాలి. విద్యార్థులు తమ ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఈ -వ్యర్థాలపై అవగాహన కల్పిస్తే ఈ కార్యక్రమం మరింత విస్తృతమవుతుంది. ఇలా చిన్న స్థాయిలో ప్రారంభమైన ప్రయత్నాలు పెద్ద సామాజిక మార్పునకు దారితీస్తాయి. సాంకేతిక అభివృద్ధిని ఆపడం సాధ్యం కాదు. కానీ దాని వల్ల ఏర్పడే వ్యర్థాలను బాధ్యతాయుతంగా నిర్వహించడం మన చేతుల్లోనే ఉంది. ఈ -వ్యర్థాలను నిర్లక్ష్యంగా పారేస్తే అవి పర్యావరణానికి ముప్పుగా మారతాయి. అదే శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించి, పునర్వినియోగించి, రీసైక్లింగ్ చేస్తే విలువైన వనరులుగా మారతాయి

# రాహుల్ అమెరికన్ ఎత్తుగడలు



నీట్ పరీక్షల అవకతవకలను నిరసిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ జూన్-జూలై నెలల్లో ప్రారంభించిన ఉద్యమానికి అనూహ్యమైన, అపూర్వమైన స్పందన రావడం తెలిసిందే. స్పందించిన వారిలో అత్యధికులు యువతీయువకులు. విద్యాశాఖ మంత్రి రాజీనామాను సాధించడంతో సీజేపీ ప్రతిష్ట ఆకాశాన్నంటింది. ఆ వెంటనే వారు స్కూ ల్ రీక్ కరో కార్యక్రమాన్ని చేపట్టి, విద్యారంగం పరిస్థితి ఎంత అధ్వానంగా ఉన్నదో వీడియో ఆధారాలతో దేశం ముందుకు తేవడంతో వారి పట్ల గౌరవం మరింత పెరిగింది. ఆ కార్యక్రమం సాగుతుండగానే ఓటర్ల జాబితా సవరణ ఒక కుంభకోణంగా వెల్లడి కావడంతో దానిని సీజేపీ సీరియస్‌గా తీసుకుని యువతను భారీ ఎత్తున కదిలించింది. ఇట్లా వరుసగా జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో వారెక్కడా రాజీపడకపోవడం, తీవ్రమైన పోలీస్ అణచివేతలకు భయపడకపోవడం, మోదీ ప్రభుత్వాన్ని సాహసోపేతంగా ధిక్కరిస్తూ ఉండడంతో యువతరంతోపాటు సమాజానికి కూడా ఒక కొత్త ఆశా కిరణంగా రూపు తీసుకోసాగారు. సరిగ్గా ఇక్కడ మొదలయ్యాయి రాహుల్‌గాంధీ ఎత్తుగడలు. కాక్రోచ్‌లు జరుపుతూ వస్తుండిన కార్యక్రమాలను (స్కూళ్ల సమస్య మినహా) కాంగ్రెస్ కూడా చేసినప్పటికీ అవి ఒక పరిమిత స్థాయిలో రొటీన్‌గా సాగి మిగిలిపోయాయి. అందుకు కారణం కాంగ్రెస్ పట్ల విశ్వాసమన్నది ఎప్పటి నుంచో సన్నగిల్లుతుండటం. ఇటువంటి పరిస్థితుల మధ్య రాహుల్ గాంధీ బృందానికి, దేశ యువతరం కాక్రోచ్‌ల వైపు మళ్లటం, వారి ఆకర్షణ క్రమంగా విస్తరిస్తుండటం సమస్యగా మారింది. దానితో సీజేపీని తమ దారికైనా తెచ్చుకోవాలి, లేదా ఆ సంస్థకు ఏవో ముద్రలు వేసి బదనాం చేయాలనే ఎత్తుగడలు మొదలుపెట్టారు. వారు లొంగి వచ్చే అవకాశాలు కనిపించకపోవడంతో సీజేపీ అనేది బీజేపీకి బీ-టీమ్ అనే ప్రచారాలు మొదలుపెట్టారు. ఆ సంస్థలోని ముఖ్యులు కొందరు లోగడ ఆప్‌లో పని చేసిన వారైనందున 'ఆప్‌కు బీ-టీమ్' అని కూడా అన్నారు. కానీ అవేవీ పనికిరాలేదు. ఆ విధంగా రాహుల్ ఎత్తుగడలు విఫలమయ్యాయి. ఉదాహరణకు సీజేపీ, ఏఐఎస్ఏ చేపట్టిన మొదటి అంశం పరీక్షా పత్రాల లీక్ కాగా, అది ప్రస్తుత బీజేపీ హయాంలోనే గాక లోగడ కాంగ్రెస్ పాలనలోనూ జరిగిందని వారు గుర్తు చేశారు. అదే విధంగా 'స్కూల్ రీక్ కరో' కార్యక్రమం మొదలుపెట్టినప్పుడు, ప్రభుత్వ పాఠశాలల తీవ్రమైన దుస్థితి కాంగ్రెస్ పాలన రోజుల నుంచి నేటికీ కొనసాగుతున్నదని విమర్శలు చేశారు. ఆందోళనల అణచివేత ఏదో ఒక స్థాయిలో బీజేపీ కన్నా ముందు కూడా కనిపించిందన్నారు. దానితో ఇటీవల ఒక కొత్త ఎత్తు మొదలుపెట్టారు. అది ద్విముఖవ్యూహం. ఏకకాలంలో ఒకవైపు సీజేపీపై ఎవరికో బీ-టీమ్ అనే ప్రచారం చేస్తూ, మరొకవైపు వారిని మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నించడం. ఆ విధంగా ప్రచారమన్నది యథాప్రకారం సాగిస్తూనే, తమ నిరసన కార్యక్రమాలకు సీజేపీని ఆహ్వానించడం మొదలుపెట్టారు. సీజేపీపై అణచివేతలను ఖండించారు. యువతరం తన ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. వారికి తాము మద్దతుగా నిలుస్తామన్నారు. ఇంకా అటువంటివే. తమ గత వారపు నిరసన ప్రదర్శనలో ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహ బోరా పాల్గొనడంతో రాహుల్‌కు సీజేపీ విషయమై కూడా కొత్త ఆశలు కలిగాయి. ఆ సంస్థ నాయకత్వానికి రాయబారాలు పంపారు. కానీ ఇవేమీ కూడా కాక్రోచ్ నాయకత్వ వైఖరిని మార్చలేకపోయాయి. మొదట నేహ బోరా తాము కాంగ్రెస్ నిరసనలో పాల్గొనడం సర్ సమస్యకు పరిమితమైనదే తప్ప, ఆ పార్టీతో కలిసే ప్రసక్తి లేదని స్పష్టంచేశారు. ఆ తర్వాత సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే కూడా కాంగ్రెస్ కార్యక్రమంలో బయటి నుంచి ఏకీభవిస్తామని, ఆ పార్టీని వ్యతిరేకించబోమని, అంతేగానీ వారితో కలవబోమన్నారు. ఈ సంస్థల వైఖరికి స్పష్టమైన కారణాలున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, భారతదేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు కాంగ్రెస్ సహా అన్ని పార్టీలదీ బాధ్యత ఉన్నదన్నది ఈ సంస్థల నాయకులు తరచూ ఎత్తిచూపుతున్న విషయం. ఉదాహరణకు సీజేపీ, ఏఐఎస్ఏ చేపట్టిన మొదటి అంశం పరీక్షా పత్రాల లీక్ కాగా, అది ప్రస్తుత బీజేపీ హయాంలోనే గాక లోగడ కాంగ్రెస్ పాలనలోనూ జరిగిందని వారు గుర్తు చేశారు. అదే విధంగా 'స్కూల్ రీక్ కరో' కార్యక్రమం మొదలుపెట్టినప్పుడు, ప్రభుత్వ పాఠశాలల తీవ్రమైన దుస్థితి కాంగ్రెస్ పాలన రోజుల నుంచి నేటికీ కొనసాగుతున్నదని విమర్శలు చేశారు. ఆందోళనల అణచివేత ఏదో ఒక స్థాయిలో బీజేపీ కన్నా ముందు కూడా కనిపించిందన్నారు. అటువంటి స్థితిలో వారు కాంగ్రెస్‌తో చేతులు కలిపి పని చేయడం సాధ్యమయ్యేది కాదు. వాంఛనీయం కూడా కాదు. వారు ఆ పని చేసినట్టయితే యువత దృష్టిలో, ప్రజల దృష్టిలో తమ విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉన్నది. స్వయంగా కాంగ్రెస్ తన విశ్వసనీయతను కోల్పోతున్నప్పుడు వారితో కలవకపోవడమే సరైన నిర్ణయం అవుతుంది. అయితే దీప్కే, నేహ బోరా స్వయంగా స్పష్టం చేసినట్టు 'సర్' అనేది సార్వత్రిక సమస్య అయినందున అందుకు పరిమితమై కాంగ్రెస్‌తో సంఘీభావాన్ని చూపడం వరకు పొరపాటు ఉండదు. పోతే, ఈ సంస్థల కార్యక్రమాలు ఈ రెండు, మూడు అంశాలకు పరిమితమైనవి కావు. వారికి దీర్ఘకాలిక ప్రణాళికలున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ ఒక స్పష్టమైన లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్ సామాజిక వేదికగా రూపొందుతుండగా, నేహ బోరా సంస్థ ఒక మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీకి అనుబంధమైనది. కాంగ్రెస్ కూడా మొదటి నుంచి లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్ పార్టీ అయినా, గత 30 ఏండ్లుగా ఆ మార్గం నుంచి దారి మళ్లుతూ వస్తున్నది. కనుక ఈ సంస్థలకు కాంగ్రెస్‌తో మైత్రి అనేది అసంబద్ధ విషయం. అయినప్పటికీ, చింతచచ్చినా అధికారపు కోరికల పులుపు చావని రాహుల్‌కు వేస్తూ వస్తున్న ఎత్తుగడల్లో ఒకటి, ఇతర ప్రతిపక్షాలను 'మీరు మాతో లేకుంటే బీజేపీతో ఉన్నట్టే, వారికి బీ-టీమ్ అయినట్టే' అని ఆరోపించడం. కానీ ఈ చవకబారు ఎత్తుగడలు పని చేయడం లేదు. కాంగ్రెస్ వాళ్లు ఇదే మాట బీఆర్ఎస్ గురించి కూడా అనడం తెలిసిందే. ఆప్, టీఎంసీ వంటివి కూడా ఈ ప్రచారానికి గురయ్యాయి. ప్రస్తుతం కాక్రోచ్‌లను కాంగ్రెస్ లక్ష్యం చేసుకున్నారు. తమ అధికారం కోసం వారిని కబలించాలన్నది ఎత్తుగడ. రాహుల్ గాంధీ ప్రదర్శిస్తున్న ఇటువంటి అసమర్థ దుర్జనత్వ ఎత్తుగడలు కూడా 'ఇండి' కూటమి గందరగోళానికి ఒక ముఖ్య కారణం. సీజేపీ విషయానికి వస్తే, ఆ సంస్థపై ఈ తరహా కుయుక్తుల వల్ల తాము యువతరానికి, సమాజానికి మరింత దూరం కాగలమనే వివేకం రాహుల్ గాంధీకి కలుగడంలేదు.

# ధర్మ విజయానికి దసరా దర్పణం!

**చెడుపై మంచి.. అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి**

**శక్తి ఆరాధనలో ఆధ్యాత్మిక సందేశం.. సంప్రదాయాల్లో భారతీయ సంస్కృతి వైభవం**




దసరా.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ముఖ్యమైన పండుగ. చెడుపై మంచి, అసత్యంపై సత్యం, అధర్మంపై ధర్మం సాధించిన విజయాన్ని చాటిచెప్పే పర్వదినం విజయదశమి. ఇది కేవలం వేడుకలకే పరిమితమైన పండుగ కాదు.. మనిషిలోని అహంకారం, అసూయ, ద్వేషం, స్వార్థం వంటి దుర్గుణాలను జయించి, సత్యం, న్యాయం, దయ, ధర్మం వంటి సద్గుణాలను అలవరచుకోవాలని సందేశమిచ్చే సందర్భం.

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు దేవీ నవరాత్రులు నిర్వహించి, పదో రోజున విజయదశమిని జరుపుకుంటారు. శరదృతువులో వచ్చే ఈ ఉత్సవాలను శరన్నవరాత్రులుగా కూడా పిలుస్తారు. తొమ్మిది రోజుల పాటు దుర్గాదేవిని వివిధ రూపాల్లో ఆరాధించడం ఈ పండుగలో ప్రధాన విశేషం. కొన్ని సంప్రదాయాల్లో తొలి మూడు రోజులు పార్వతీదేవికి, తరువాతి మూడు రోజులు మహాలక్ష్మికి, చివరి మూడు రోజులు సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేస్తారు. శక్తి, సంపద, జ్ఞానం మానవ జీవితానికి ఎంత ముఖ్యమో ఈ ఆరాధన తెలియజేస్తుంది. ఆలయాల్లో అమ్మవారి అలంకారాలు భక్తులను ఆకట్టుకుంటే, ఇళ్లలో బొమ్మల కొలువులు, ప్రత్యేక పూజలు సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయి.

పురాణాల ప్రకారం, మహిషాసురుడు వరబలంతో దేవతలను ఓడించి లోకాలను అల్లకల్లోలం చేశాడు. అతడి దౌర్జన్యాలను అరికట్టేందుకు దేవతల తేజస్సుతో ఆదిపరాశక్తి దుర్గాదేవి అవతరించింది. దేవతలు సమర్పించిన ఆయుధాలతో తొమ్మిది రోజుల పాటు యుద్ధం చేసి, పదో రోజు మహిషాసురుడిని సంహరించినట్లు పురాణ విశ్వాసం చెబుతుంది. ఈ విజయానికి గుర్తుగా విజయదశమిని జరుపుకుంటారు. ఈ కథలోని అంతరార్థం స్పష్టం.. శక్తి, అధికారం ఉన్నంత మాత్రాన విజయం శాశ్వతం కాదు. వాటిని దుర్వినియోగం చేస్తూ అహంకారానికి లోనైతే పతనం తప్పదనే సందేశం ఇందులో ఉంది.

విజయదశమికి శ్రీరాముడి విజయంతోనూ ప్రత్యేక అనుబంధం ఉంది. రామాయణ కథనం ప్రకారం, సీతను అపహరించిన రావణుడిపై శ్రీరాముడు యుద్ధం చేసి విజయం సాధించాడు. రావణుడు గొప్ప జ్ఞానం, పరాక్రమం కలిగినవాడైనా అతడి అహంకారం, అధర్మం పతనానికి కారణమయ్యాయి. అందుకే కొన్ని ప్రాంతాల్లో విజయదశమి సందర్భంగా రావణుడి దిష్టిబొమ్మలను దహనం చేస్తారు. ఈ ఆచారం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుంది. అయితే నిజమైన రావణ దహనం మనలోని అహంకారం, కోపం, ద్వేషం, అసూయ వంటి దుర్గుణాలను తొలగించుకున్నప్పుడే సార్థకమవుతుంది.

విజయదశమి రోజున జమ్మి చెట్టును పూజించడం, జమ్మి ఆకులను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం కూడా ప్రత్యేక సంప్రదాయం. పురాణ విశ్వాసాల ప్రకారం, పాండవులు తమ ఆయుధాలను జమ్మి చెట్టులో దాచిపెట్టి, అజ్ఞాతవాసం ముగిసిన తర్వాత తిరిగి స్వీకరించారు. ఈ కథతో అనుసంధానంగా జమ్మి పూజకు ప్రాధాన్యం ఏర్పడింది. ఆయుధ పూజ, వాహన పూజ, పనిముట్ల పూజ నిర్వహించడం ద్వారా మన జీవనానికి తోడ్పడే వస్తువులను గౌరవిస్తారు. వాటిని బాధ్యతగా వినియోగించుకోవాలనే భావన కూడా ఈ ఆచారాల్లో అంతర్లీనంగా కనిపిస్తుంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో దసరా వేడుకలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో దేవీ నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తారు. తెలంగాణలో బతుకమ్మ సంబరాలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ, ఆటలతో అమ్మవారిని ఆరాధిస్తారు. బతుకమ్మ పండుగ ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని, మహిళల ఐక్యతను, తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెబుతుంది. పండుగలు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను ఒకచోట చేర్చి సామాజిక సంబంధాలను బలోపేతం చేస్తాయి.

విజయదశమిని కొత్త పనులకు శ్రీకారం చుట్టేందుకు శుభదినంగా భావిస్తారు. విద్యారంభం, వ్యాపార ప్రారంభం, వాహనాలు, పనిముట్ల పూజలు నిర్వహించడం ఆనవాయితీ. కొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ఈ పండుగ స్ఫూర్తినిస్తుంది. అయితే విజయం సాధించాలంటే శుభారంభంతో పాటు కృషి, పట్టుదల, క్రమశిక్షణ, నిజాయితీ కూడా అవసరం. ఇతరులపై ఆధిపత్యం సాధించడం కంటే మనలోని లోపాలను అధిగమించడం గొప్ప విజయమని దసరా గుర్తుచేస్తుంది.

నేటి సమాజంలో అసహనం, స్వార్థం, అన్యాయం వంటి సమస్యలు కనిపిస్తున్న వేళ విజయదశమి సందేశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. బలహీనులకు అండగా నిలవడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, మాటల్లోనే కాక చేతల్లోనూ నిజాయితీని పాటించడం ధర్మాచరణలో భాగం. పండుగ సందర్భంగా చేసే పూజలు మన ఆలోచనల్లో, ప్రవర్తనలో మంచి మార్పుకు దారితీసినప్పుడే వాటికి నిజమైన అర్థం ఉంటుంది. మనలోని చెడును తొలగించుకుంటూ, కుటుంబం నుంచి సమాజం వరకు మంచిని పెంపొందించేందుకు కృషి చేయడమే దసరా అందించే అసలైన సందేశం.

# శ్రీశైలంలో వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

**శ్రీశైలం, అక్టోబర్ 19, 2026:**
శ్రీశైల దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు, హోమాలు, జపానుష్ఠానాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని సిద్ధిదాయినీ దేవి స్వరూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు.

**అమ్మవారికి విశేష పూజలు**
ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారాలు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానాలు నిర్వహించారు. చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీ పూజలు జరిపించారు. అదేవిధంగా స్వామివారికి రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్ర పారాయణలు నిర్వహించారు. సాయంకాలం జపాలు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఆస్థానసేవ, సువాసినీ పూజలు, రాత్రి 10 గంటలకు కాళరాత్రి పూజలు నిర్వహించేందుకు కార్యక్రమాలను రూపొందించారు.

**సంప్రదాయబద్ధంగా కుమారీ పూజలు**
దసరా మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ నిర్వహిస్తున్న కుమారీ పూజల్లో రెండు నుంచి పది సంవత్సరాల వయస్సు గల బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో కుమారీ పూజకు విశిష్టమైన స్థానం ఉందని ఆలయ సంప్రదాయాలు తెలియజేస్తున్నాయి.

**సిద్ధిదాయినీ దేవిగా అమ్మవారి అలంకరణ**
నవదుర్గ అలంకారాల్లో భాగంగా శ్రీ భ్రమరాంబాదేవి ఉత్సవమూర్తిని సిద్ధిదాయినీ దేవి స్వరూపంలో






అలంకరించారు. చతుర్భుజాలతో దర్శనమిచ్చే ఈ దేవి కుడివైపున చక్రం, గద, ఎడమవైపున శంఖం, పద్మాలను ధరించి ఉంటారని పురాణాలు పేర్కొంటున్నాయి. సిద్ధిదాయినీ దేవిని ఉపాసించడం వల్ల అణిమ, మహిమ, గరిమ, లఘిమ తదితర అష్టసిద్ధులు లభిస్తాయని ఆధ్యాత్మిక విశ్వాసం. అమ్మవారిని పూజించడం వల్ల భక్తుల కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తారు.

**వైభవంగా కైలాస వాహనసేవ**
దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీ స్వామి అమ్మవార్లకు కైలాస వాహనసేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కైలాస వాహనంపై అధిష్ఠింపజేసి పూజాదికాలు నిర్వహించారు.

**విజయదశమి వేడుకలకు ఏర్పాట్లు**
మంగళవారం (20.10.2026) విజయదశమి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి విశేష పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 9.15 గంటలకు సహస్ర చండీపారాయణ పూర్వక శతచండీయాగ పూర్ణాహుతి, 10 గంటలకు రుద్రయాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, వసంతోత్సవం, అవభృథం తదితర విశేష పూజలు జరగనున్నాయి. సాయంత్రం శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి నిజరూపాలంకరణ, శ్రీ స్వామి అమ్మవార్లకు నందివాహనసేవ నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు ఆలయ ఉత్సవం, శమీపూజ, రాత్రి 8 గంటలకు తెప్పోత్సవం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

## ఎన్నికల నిబంధనలు నిర్వహణపై రాజకీయ నాయకులకు దిశ నిర్దేశం

**శిరివెళ్ళ.(డ్రీమ్ టైమ్స్)**
మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలు నిర్వహణపై రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎన్నికల అధికారి విజయ శేఖర్ రెడ్డి ఎస్సై మధుసూదన్ పలు పార్టీల నాయకులు హాజరయ్యారు.ఎన్నికల ప్రక్రియ, చట్టపరమైన నిబంధనలు, రాజకీయ నాయకులు పాటించాల్సిన నియమాలపై చర్చించి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మధుసూదన్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులు చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని నాయకులకు వివరించారు.
అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 3, 2026న పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ స్థానాలు రిజర్వేషన్ ల
ఆధారంగా నామినేషన్ దాఖలు చేయాలని సెల్ఫ్ డిక్లరేసన్,ఆదాయ పన్ను అభ్యర్థులను బలపరిచే వారిది మరియు ఏజెంట్ ఆధార్ కార్డులు తప్పనిసరిగా ఉండాలని అన్నారు.
కోర్టు కేసులు విచారణ మరియు పెండింగ్ కేసులు ఉంటే కనపరసాలన్నారు
ఆస్తుల వివరాలు,వ్యక్తిగత రుణాలు,వాహనాల వివరాలు,ఆస్తుల విలువ. వృత్తి వివరాలు విద్యా అర్హత కోర్సు వివరాలు స్పష్టం చేయాలన్నారు.ఆస్తి పన్ను నో డ్యూ సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు.
ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారు డిపాజిట్ రాయితీ కోసం క్యాస్ట్ మరియు ఇన్కమ్ సర్టిఫికెట్ అందజేయాలని
ఎంపీటీసీలు 1500 జడ్పిటిసిలు 3000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.
అభ్యర్థులు కాకుండా ఇతరుల ఇళ్లపై అనుమతులు లేకుండా పార్టీ జెండాలు పెట్టరాదని
ర్యాలీలు సభలు సమావేశాలు పెట్టాలంటే పోలీస్



శాఖ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. కూలింగ్ సమయానికి 48 గంటల ముందే ప్రచారం ముగించాల్సి ఉంటుందన్నారు.
ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ ఉద్యోగులు ప్రచార కార్యక్రమంలో పాల్గొనరాదన్నారు.
సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.ఒక్కసారి ఎలక్షన్ కేసులలో ఇరుక్కుంటే ప్రతి ఎన్నికలకు కేసు వెంటాడుతుందని హెచ్చరించారు.
లాయర్ ద్వారా గాని తెలిసిన వారి ద్వార నామినేషన్ పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు.
ఒక అభ్యర్థికి ఇద్దరు వ్యక్తులు మరియు డ్రైవర్ తో నలుగురు మించి ఉండరాదు అన్నారు.
అభ్యర్థులకు సంబంధించిన వెహికల్ పై స్టిక్కర్ లు అర్ ఓ రిటర్నింగ్ అధికారి సంతకం ఉండాలని వాహనాలు 100 మీటర్ల దూరం లో ఆగిపోవాలని ఎస్సై సూచించారు.
అక్టోబర్ 21 నుండి 23 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఉదయం 10-30 సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్ దాఖలు తీసుకోవచ్చునన్నారు.
21 నుండి 23 వరకు నామినేషన్ల స్వీకరణ, 24న నామినేషన్ల పరిశీలన, 25న అప్పిల్ల దాతలు, 26న అప్పీల్లపై తుది నిర్ణయం, 27న నామినేషన్ల ఉపసంహరణ అదే రోజు 27న అభ్యర్థుల జాబితా ప్రకటన. నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 4న అవసరమైతే రీపోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు ఫలితాలు ఉంటాయని వివరించారు.శిరివెళ్ల మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎన్నికల హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామని అవసరమైన సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు.
ఎన్నికల కోడ్ ప్రారంభమైనప్పటినుండి మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ మధుసూదన్ తెలియజేశారు, ముగ్గురికి మించి గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు.
క్రాంతి భద్రతలకు విగాథం కలిగిస్తూ అల్లర్లకు పాల్పడితే పోలీస్ శాఖ చర్యలు కఠినంగా ఉంటాయని
శిరివెళ్ల మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని ఎక్కడైనా పోటీ చేయవచ్చని తెలిపారు.
ఎంపీటీసీలు 4 లక్షలు జడ్పిటిసి 8 లక్షలు మించి ఖర్చు చేయరాదని అబ్జర్వర్లు ఎన్నికల అధికారులు ప్రత్యేక పోలీస్ బలగాల నిఘా నీడలో నామినేషన్ నుండి కౌంటింగ్ వరకు ఎన్నికల కోడ్ ముగిసే వరకు అభ్యర్థులు చేసే ఖర్చును చూపించాల్సి ఉంటుందన్నారు.
ప్రభుత్వ గుర్తింపు ఉన్న సంఘాలు సొసైటీ అధ్యక్షులు కమిటీ వారు నామినేషన్ వేయడానికి అనర్హులని లోకల్ బాడి ఎంపిటిసిలు గతంలో మాదిరిగానే ఎంపీపీని ఎన్నుకుంటారన్నారు.
ఓటరు లిస్ట్ ఆయా గ్రామ పంచాయితీ కార్యదర్శుల వద్ద ఉన్నాయని అభ్యర్థులు హోటల్ జాబితాను పొందవచ్చని తెలియజేశారు.
ఎన్నికల నిర్వహణలో పార్టీల నాయకులు కార్యకర్తలు ఓటర్లు సహకరించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు.

## శ్రీశైల దేవస్థానం అన్నప్రసాద వితరణ పథకానికి రూ.1,01,011 విరాళం

**శ్రీశైలం, అక్టోబర్ 19, 2026:.(డ్రీమ్ టైమ్స్)**
శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి కర్నూలు జిల్లా, ఆదోనికి చెందిన శ్రీ యన్. ఆనంద్‌కుమార్ రూ.1,01,011 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆయన సోమవారం (19.10.2026) అందించారు.ఈ సందర్భంగా విరాళం మొత్తాన్ని దేవస్థానం పర్యవేక్షకులు పి. దేవికకు అందజేశారు. విరాళం అందించిన దాతకు దేవస్థానం తరఫున తగిన రశీదుతో పాటు ప్రసాదాలను అందజేశారు.



## చటాన్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**- అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, .(డ్రీమ్ టైమ్స్)**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు చటన్‌పల్లిలో దేవి శరణం నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా చటన్‌పల్లిలో ప్రతిష్ఠించిన అమ్మవారిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక భక్తిభావంతో పాటు సేవా స్ఫూర్తిని చాటుతున్నాయని, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. చటాన్‌పల్లిలో నవరాత్రి ఉత్సవాలు భక్తుల సందడి మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. అమ్మవారి దర్శనం కోసం స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సి. పెంటయ్య, మురళీమోహన్, దిలీప్, మాజీ కౌన్సిలర్ చేగురి రాజేందర్ రెడ్డి, సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి, శ్రీశైలం గౌడ్, సిద్ధార్థ, జాంగారి రవి, కరుణాకర్, రవితేజ, మాధవులు యాదవ్, రాజు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య, శ్రీనివాస్, విజయ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సీతారాం, చటన్‌పల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయాలకు ప్రతీకగా దేవీ నవరాత్రులు..

**-బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**

**-భక్తి పారవశ్యంలో లింగారెడ్డిగూడ దుర్గామాత మండపం.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రవీందర్ యాదవ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, .(డ్రీమ్ టైమ్స్)**
ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తుల కోలాహలం మధ్య కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ గ్రామంలోని దుర్గామాత మండపాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. వేదమంత్రాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజల జీవితాల్లో సంతోషం, శాంతి వెల్లివిరియాలని, రైతులకు ప్రకృతి అనుకూలించి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. పండుగలు, పూజా కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, స్థానిక మాజీ సర్పంచ్, ఎంపీటీసీ బిశ్వ మాధవి రామకృష్ణ, సర్పంచ్ గీత వీరేశం, కౌన్సిలర్లు శారద శేఖర్, వసంత శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సింలు గౌడ్, మాజీ కౌన్సిలర్ జూపల్లి శంకర్, నాయకులు రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, మల్లేష్ యాదవ్, గోద లక్ష్మయ్య యాదవ్, బుచ్చి రెడ్డి, లింగారెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, శశాంక్ గౌడ్, గణేష్, యాదయ్య, విఠలయ్య, షాబాద్ మల్లేష్, ప్రతాప్ రెడ్డి, చందు, రవి, మహేష్, బలరాం, లక్ష్మయ్య, అంజయ్య, జగన్, నాగేష్, నర్సింలు తదితరులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## దసరాకూ అందని ఆసరా.. లబ్ధిదారులకు నిరాశ: బీవీహెచ్‌పీఎస్



**.(డ్రీమ్ టైమ్స్)**
**పరిగి అక్టోబర్ 19**
విజయదశమి పండుగ వచ్చినా ఆసరా పెన్షన్లు విడుదల చేయకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు ఆవేదన వ్యక్తం చేశారు. ఉగాది, ఆగస్టు 15, దసరా,అంటూ వాయిదాలు వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పెన్షన్ల దారులను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ పెన్షన్లను వెంటనే ఇవ్వాలని, ఇకపై ప్రతినెలా 1 నుంచి 5వ తేదీ లోపే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

## కొత్తగా వేసిన రోడ్డును దున్నేసినందుకు సిగ్గుపడాలి...
# ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్

**-పుల్లంపేట మండలంలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేశారని ఆరోపణ**

**-వైసీపీ నేతలే ట్రాక్టర్‌తో రోడ్డును తవ్వేశారన్న మంత్రి నారా లోకేశ్**

**-రూ.4.75 కోట్లతో నిర్మించిన రోడ్డు అని వెల్లడి**

**-ఇది కక్షపూరిత చర్య అని, ప్రజలపై దాడి అని తీవ్ర ఆగ్రహం**

**-బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, పోలీసులకు విజ్ఞప్తి**



**తిరుపతి,అమరావతి, ఏపీ బ్యూరో, (డ్రీమ్ టైమ్స్)** తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో దారుణమైన ఘటన చోటు చేసుకుందని, వైసీపీ నాయకుల కక్షపూరిత చర్యలకు ఇది నిదర్శనమని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజల కోసం రూ.4.75 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును, వేసిన నాలుగు రోజులకే వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్య దిగ్భ్రాంతికరమని, సిగ్గుచేటని ఆయన చర్య దిగ్భ్రాంతి కరమని, సిగ్గుచేటని ఆయన అభివర్ణించారు.

పుల్లంపేట మండలంలోని అనంత సముద్రం, పాపక్కగారి పల్లె గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్డును నిర్మించామని లోకేశ్ తెలిపారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించి రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో గ్రామస్థులు సంతోషంగా ఉన్నారని, కానీ వారి ఆనందాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని అన్నారు. "ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం రాజకీయం అనిపించుకోదు. ఇది కచ్చితంగా ప్రజలపై జరిగిన అహంకారపూరిత దాడి. కక్ష సాధింపు చర్యలతో ప్రజాధనాన్ని ఇలా నాశనం చేయడం అత్యంత హేయమైన చర్య" అని లోకేశ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను, జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆయన కోరారు. ధ్వంసమైన రోడ్డును వీలైనంత త్వరగా పునరుద్ధరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అరాచక చర్యలను ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం నిందితులకు శిక్ష పడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.'

## రోడ్డు వేస్తే ట్రాక్టర్ తో దున్నేశారు..
# ఇదేం పైశాచిక ఆనందం?...సీఎం చంద్రబాబు

**-ఉండవల్లిలో చంద్రబాబు మీడియా సమావేశం**

**-స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యర్థి పార్టీపై చంద్రబాబు విమర్శలు**

**-మెగా డీఎస్సీని అడ్డుకోవాలని వందల సార్లు కోర్టుకెళ్లారని ఆగ్రహం**

**-55 సేవలపై ప్రజల అభిప్రాయం తీసుకుని జవాబుదారీతనం పెంచామని వెల్లడి**

**-విధ్వంసంతో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించామని ఉద్ఘాటన**



**అమరావతి, ఏపీ బ్యూరో, (డ్రీమ్ టైమ్స్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం వేసిన రోడ్డును కొందరు ట్రాక్టర్‌తో దున్నేశారని, ఇది వారి పైశాచిక ఆనందానికి, ఉన్మాదానికి నిదర్శనమని తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉండవల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈరోజు టీవీలో చూశాను. మేం రోడ్లు వేస్తే, ఆ రోడ్డును ట్రాక్టర్‌తో దున్నేశారు. ఇది భరించలేక చేస్తున్నారా, లేక ఉన్మాదమో, పైశాచిక ఆనందమో నాకు అర్థం కావడం లేదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**విధ్వంసానికే ప్రాధాన్యమిస్తున్నారన్న చంద్రబాబు**

ఓవైపు తాము అభివృద్ధి, జవాబుదారీ పాలన అందిస్తుంటే, మరోవైపు కొందరు విధ్వంసానికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం 55 రకాల సేవలను అందిస్తోందని, ఆర్టీసీ బస్సులు, ఆసుపత్రులు, అన్నా క్యాంటీన్లు, రేషన్ షాపుల వరకు ప్రతి సేవపైనా ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నామని తెలిపారు. ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరించి, అధికారుల పనితీరును సమీక్షిస్తున్నామని అన్నారు. నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో అధికారుల ముందే వారి పనితీరుపై ప్రజల అభిప్రాయాలను చదివి వినిపిస్తూ, తప్పు చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నామని, ఇంతకంటే జవాబుదారీతనం ఎక్కడా ఉండదని స్పష్టం చేశారు.

**పెట్టుబడులకు రాష్ట్రాని నంబర్ వన్ గమ్యస్థానంగా తీర్చిదిద్దాం**

రాజకీయ విధ్వంసం కారణంగా కోల్పోయిన 'బ్రాండ్ ఏపీ'ని మళ్లీ పునరుద్ధరించి, పెట్టుబడులకు రాష్ట్రాని నంబర్ వన్ గమ్యస్థానంగా తీర్చిదిద్దామని చంద్రబాబు అన్నారు. గత రెండున్నర ఏళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, ఇవి పూర్తయితే 20 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమానికి నాంది పలికామని, దీనివల్ల కరవు పరిస్థితుల్లోనూ నీటి సమస్య ఉండదని చెప్పారు.

**పేద పిల్లలకు ఉద్యోగాలు రాకుండా అడ్డుకోవాలని చూశారు**

మెగా డీఎస్సీ విషయంలో ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరును చంద్రబాబు తీవ్రంగా తప్పుపట్టారు. "పేద పిల్లలకు ఉద్యోగాలు రాకుండా ఉండేందుకు సుమారు 200-300 సార్లు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారు. మేం పట్టుబట్టి ఉద్యోగాలు ఇస్తే, మాపైనే ఆరోపణలు చేశారు. నిజం నిప్పు లాంటిది. దానితో ఆడుకుంటే మసైపోతారే తప్ప నిలవలేరు" అని హెచ్చరించారు. ఒకప్పుడు ఎడారిగా మారుతుందనుకున్న రాయలసీమ, నేడు తమ ప్రభుత్వ కృషితో 'రాయలసీమ రైజింగ్'గా ఎదుగుతోందని పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు

## స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి...రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

**-నామినేషన్ల దాఖలు సమయంలో ఘర్షణలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలి**



**ఒంగోలు, అమరావతి, ఏపీ బ్యూరో, (డ్రీమ్ టైమ్స్)** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా చెప్పారు. ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో సోమవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు తీరు, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు నామినేషన్ల సందర్భంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, నిబంధనల ఉల్లంఘనలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపునకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, తదితర అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు.

**ఘర్షణలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలి**

నామినేషన్ల దాఖలు సమయంలో ఘర్షణలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని అనిల్ చంద్ర స్పష్టం చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్లను వెంటనే స్కాన్ చేసి డిజిటల్ రూపంలో కూడా భద్రం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్లకు చెప్పారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్ట్రాంగ్ రూమ్ వద్ద కల్పించాల్సిన భద్రత విషయంలోనూ, ఓట్ల లెక్కింపునకు పట్టాల్సిన ఏర్పాట్ల విషయంలోనూ ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసినందున ఆయా విషయాలలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆయన పునరుద్ఘాటించారు. స్థానికంగా పోలీసు సిబ్బంది లభ్యత, వెబ్ లైవ్ కాస్టింగ్ ను దృష్టిలో పెట్టుకుని ఓట్ల లెక్కింపు కేంద్రాల విషయంలో జిల్లా కలెక్టర్లు నిర్ణయం తీసుకోవచ్చని అనిల్ చంద్ర తెలిపారు. జిల్లాల లోని పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని ఎన్నికల పరిశీలకులకు ఆయన చెప్పారు.

ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల పరిశీలకురాలు హెప్సిబా రాణి, ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేక్, కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ పి.వెంకట రమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణ విభాగ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర రావు, ఒంగోలు కార్పొరేషన్ తో సహా అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల వ్యయంపై ప్రత్యేక నిఘా పెట్టాలి

**-బ్యాంక్, యూపీఐ లావాదేవీలపై నిశిత పరిశీలన చేయాలి**
**-ఎన్నికల వ్యయ పరిశీలకుల ఆదేశం..**
**-అధికారులకు దిశానిర్దేశం**





**ఒంగోలు, ప్రకాశం బ్యూరో, (డ్రీమ్ టైమ్స్)** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు చేసే ఎన్నికల వ్యయంపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎన్నికల వ్యయానికి సంబంధించి నిర్దేశించిన నియమ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఎన్నికల పరిశీలకులు అధికారులను ఆదేశించారు. ఎన్నికల వ్యయ నిర్వహణ, పర్యవేక్షణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఒంగోలు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు హెప్సిబా రాణి, ఎన్నికల వ్యయ పరిశీలకులు పి. వివేక్ పాల్గొని జిల్లాలోని మున్సిపాలిటీలకు నియమించిన సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు, జిల్లా ఎన్నికల వ్యయ పర్యవేక్షణ అధికారులకు పలు సూచనలు చేశారు.

**బ్యాంక్, యూపీఐ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి**

ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల ఆర్థిక లావాదేవీలను నిరంతరం పర్యవేక్షించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు సూచించారు. ముఖ్యంగా బ్యాంకు లావాదేవీలు, యూపీఐ ద్వారా జరిగే చెల్లింపులపై ప్రత్యేకంగా నివేదికలు తెప్పించుకుని నిశితంగా పరిశీలించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో పాటు ఈఈఎం అధికారి తిరుపతయ్యను ఆదేశించారు.ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిబంధనల అమలులో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఇతర మున్సిపాలిటీలకు చెందిన అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు..

**ఉప సర్పంచ్ కాలే అనిత రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**



**యాచారం, (డ్రీమ్ టైమ్స్)** యాచారం మండలం కొత్తపల్లి గ్రామంలో దుర్గా శరన్నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఉప సర్పంచ్ కాలే అనిత రమేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు, గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకుని భక్తితో పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు సోమరాజు సుధాకర్,శివకుమార్,పోలే శివ,కార్తీక్,బన్నీ, చందు, పతదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మహిళా
# కండక్టర్ ఆకస్మిక మృతి!

**-విధులు ముగించుకుని బస్టాండ్‌కు చేరుకున్న కొద్దిసేపటికే విషాదం**
**-తోటి ఉద్యోగిని మృతితో దిగ్భ్రాంతికి గురైన పొదిలి ఆర్టీసీ సిబ్బంది**
**-శోకసంద్రంలో కుటుంబ సభ్యులు**





**పొదిలి, మార్కాపురం, జిల్లా (డ్రీమ్ టైమ్స్)** పొదిలి ఆర్టీసీ డిపోలో మహిళా కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న లింగాల నాగ మల్లేశ్వరి సోమవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే..విధులు నిర్వహించి బస్టాండ్‌కు చేరుకున్న ఆమె, సమీపంలోని సెల్‌ఫోన్ రీఛార్జి దుకాణానికి వెళ్లిన సమయంలో ఒక్కసారిగా కుప్పకూలడంతో విషాదం చోటు చేసుకుంది. పొదిలి ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ నాగమల్లేశ్వరి కొండపి రూట్‌లో విధులు నిర్వహించారు. విధుల్లో భాగంగా కొండపి నుంచి పొదిలి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్న ఆమె, సెల్‌ఫోన్ రీఛార్జి కోసం బస్టాండ్ సమీపం లోని దుకాణానికి వెళ్లారు. అక్కడే ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. ఈ విషయాన్ని గమనించిన వారు ఆర్టీసీ సిబ్బందికి సమాచారం అందించడంతో, వారు వెంటనే ఆమెను వైద్యశాలకు తరలించారు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం.

**విధుల్లో చురుగ్గా కనిపించిన ఆమె..అంతలోనే అనంత లోకాలకు!**

ఉదయం నుంచి విధులను చక్కగా నిర్వహించిన నాగమల్లేశ్వరి ఆకస్మికంగా మృతి చెందడంతో తోటి ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విధి నిర్వహణలో తమతో కలిసి పని చేసిన సహోద్యోగిని కోల్పోవడం ఎంతో బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో పొదిలి ఆమె కుటుంబంలో విషాదఛాయలు అలుము కున్నాయి. నాగమల్లేశ్వరి మృతి పట్ల ఆర్టీసీ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

# బిజినెస్

## భారీ నష్టాల్లో కొనసాగుతున్న స్టాక్ మార్కెట్‌లు..

**- ఇన్వెస్టర్స్ సంపద రూ.4 లక్షల కోట్లు ఆవిరి..!**



దేశీయ స్టాక్ మార్కెట్‌లు (సోమవారం) భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. గత వారం స్టాక్ మార్కెట్ ర్యాలీ పెట్టుబడిదారుల కు కొంత ఉత్సాహాన్ని ఇచ్చినప్పటికీ.. ఆ సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు. సోమవారం బ్యాంకింగ్ స్టాక్‌ల లో భారీ పతనం కనిపిస్తోంది. పెరుగుతున్న ముడి చమురు ధరలు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. దాంతో దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది.నేటి ట్రేడింగ్‌లో మధ్యాహ్నం 2:30 గంటల సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 1,000 పాయింట్లు పడిపోగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 295 పాయింట్లు క్షీణించింది. ఈ రెండు ప్రధాన సూచీల్లో తమ గత రెండు సెషన్ల లాభాల పరంపరకు బ్రేక్ పడింది. అయితే ఈ నష్టాలు లార్జ్-క్యాప్ స్టాక్‌లకే పరిమితం కాలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా నష్టాలు మూటగట్టుకున్నాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ శుక్రవారం ముగింపు నాటి రూ.4,72,62,167 కోట్ల నుంచి సోమవారం మధ్యాహ్నం 2:30 గంటల సమయానికి రూ.4,68,17,995 కోట్లకు పడిపోయింది. దాంతో పెట్టుబడిదారులు సుమారు రూ.4 లక్షల కోట్లు నష్టపోయారు. ఈ భారీ అమ్మకాలకు అనేక కారణాలున్నాయి. ప్రముఖ ప్రైవేట్ బ్యాంకుల సూచీల నష్టాలు, విదేశీ పెట్టుబడిదారుల నిరంతర నిధుల తరలింపు, పెరిగిన ముడి చమురు ధరలు పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేశాయి. దాంతో అమ్మకాల ఒత్తిడి పెరిగి సూచీలు నష్టపోయాయి.

## స్వల్పంగా పెరిగిన పసిడి ధరలు!

- -24 క్యారెట్ల బంగారంపై రూ.380 పెరుగుదల
- -10 గ్రాముల ధర రూ.1,48,040
- -22 క్యారెట్ల పసిడిపై రూ.350 పెరుగుదల
- -10 గ్రాముల ధర రూ.1,35,700
- -కిలో వెండి ధరలో మార్పులేదు
- -హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో తాజా ధరలు
- -బంగారం, వెండిపై అదనంగా 3 శాతం జీఎస్టీ
- -ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు



హైదరాబాద్
బులియన్ మార్కెట్‌లో సోమవారం బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.380 పెరిగి రూ.1,48,040కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.350 పెరిగి రూ.1,35,700గా నమోదైంది. మరోవైపు వెండి ధరలో ఎలాంటి మార్పు లేదు. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,40,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. ఈ ధరలకు అదనంగా 3 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలను బట్టి బంగారం, వెండి ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.

## స్పోర్టీ లుక్‌తో కవాసాకి కొత్త బైక్ విడుదల

- -2027 జెడ్1100 మోడల్ ధర రూ.12.79 లక్షలు
- -1,099 సీసీ ఇంజిన్‌తో 136 బీహెచ్‌పీ శక్తి
- -ఐదు అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే ప్రత్యేకత
- -ట్రాక్షన్ కంట్రోల్, కార్నరింగ్ ఏబీఎస్ సదుపాయాలు
- -గేర్ల మార్పును సులభతరం చేసే క్విక్‌షిఫ్టర్



ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ కవాసాకి భారత మార్కెట్లో 2027 మోడల్ జెడ్1100 బైక్‌ను విడుదల చేసింది. దీని ఎక్స్-షోరూమ్ ధరను రూ.12.79 లక్షలుగా నిర్ణయించింది. శక్తివంతమైన ఇంజిన్, ఆధునిక సాంకేతిక ఫీచర్లు, స్పోర్టీ డిజైన్‌తో ఈ బైక్‌ను రూపొందించింది.
ఈ బైక్‌లో 1,099 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 136 బీహెచ్‌పీ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. ప్రయాణ సమయంలో అవసరమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు ఐదు అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లేను అందించారు.
భద్రత, నియంత్రణ కోసం ట్రాక్షన్ కంట్రోల్, కార్నరింగ్ ఏబీఎస్ సదుపాయాలు ఉన్నాయి. గేర్లను వేగంగా, సులభంగా మార్చేందుకు క్విక్‌షిఫ్టర్ సాంకేతికతను జోడించారు. రహదారిపై మెరుగైన పట్టు కోసం డన్‌లప్ టైర్లను అమర్చారు. శక్తివంతమైన పనితీరు, ఆధునిక ఫీచర్లు, ఆకర్షణీయమైన రూపంతో కొత్త జెడ్1100 బైక్ ప్రీమియం మోటార్‌సైకిల్ ప్రియులను ఆకట్టుకునేలా ఉంది.

# స్పోర్ట్స్

## చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా.. కన్ఫర్మ్ చేసిన బీసీసీఐ

ముంబై
అనుకున్నట్లే జరిగింది. బీసీసీఐ చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా సెలెక్ట్ అయ్యారు. అజిత్ అగార్కర్ స్థానంలో ఓజా ఇక సేవలు అందించనున్నారు. అయితే తాజాగా బీసీసీఐ ప్యానల్‌లోకి రమేశ్ పవార్‌కు చోటు కల్పించారు. టీమిండియా పురుషుల జట్టుకు సెలక్షన్ కమిటీలో చీఫ్ సెలెక్టర్‌గా మాజీ బౌలర్ ప్రజ్ఞాన్ ఓజాను నియమిస్తున్నట్లు ఇవాళ బీసీసీఐ కన్ఫర్మ్ చేసింది. నిన్నటి వరకు తాత్కాలిక సెలెక్టర్‌గా ఓజా చేశాడు. ఇప్పుడు బీసీసీఐ అతనికి పూర్తి బాధ్యతలు అప్పగించింది. అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే నేతృత్వంలోని క్రికెట్ అడ్వైజరీ కమిటీ .. మెన్స్ సెలెక్షన్ కమిటీ సభ్యులను నియమించే ప్రక్రియను చేపట్టింది.సీనియార్టీ ఆధారంగా మెన్స్ సెలెక్షన్ కమిటీ సమావేశాలకు ప్రజ్ఞాన్ ఓజా నేతృత్వం వహిస్తారని బీసీసీఐ చెప్పింది. టెస్టు మ్యాచ్‌లు ఆడిన ఆధారంగా ఆ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కమిటీలో శివ సుందర్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా, రమేశ్ పొవార్ ఉన్నారు. భారత మెన్స్ క్రికెట్ జట్టును ఎంపిక చేసే బాధ్యత ఈ అయిదుగురి సభ్యులపై ఉంటుంది.48 ఏళ్ల పవార్ రెండు టెస్టులు, 31 వన్డేలు ఆడాడు. 2004 నుంచి 2007 మధ్య అతను ఇండియాకు



రిప్రజెంట్ చేశాడు. భారత మహిళ క్రికెట్ జట్టుకు రెండు సార్లు హెడ్ కోచ్‌గా కూడా పొవార్ బాధ్యతలు నిర్వర్తించాడు. ఆయన కోచ్‌గా ఉన్నప్పుడే మహిళల జట్టు ఆసియాకప్ టైటిల్ గెలుచుకున్నది. కామన్‌వెల్త్ గేమ్స్‌లో సిల్వర్ దక్కింది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోనూ అతను స్పిన్ బౌలింగ్ కోచ్‌గా చేశాడు. మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌పై బీసీసీఐ ప్రశంసలు కురిపించింది. ఆయన పదవీ కాలంలో ఇండియా మూడు ఐసీసీ ట్రోఫీలు, రెండు ఆసియాకప్ టైటిళ్లతో పాటు ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ గెలుచుకున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకా తెలిపారు.

## జట్టు నుంచి తప్పించినా.. సెంచరీతో పాక్‌ను గెలిపించాడు!

రావల్పిండి క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన ట్రై సిరీస్ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించింది. దీంతో టోర్నీని విజయంతో ప్రారంభించింది. శ్రీలంకతో జరిగిన ఈ పోరులో పాక్ 37 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్.. 49.5 ఓవర్లలో 305 పరుగులు చేసింది. అనంతరం శ్రీలంక 48.1 ఓవర్లలో 268 పరుగులకు ఆలౌట్ అయింది.టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్‌కు ఆరంభంలోనే దెబ్బ తగిలింది. మధుశంక దెబ్బకు ఓపెనర్లు త్వరగానే పెవిలియన్ చేరారు. అయితే బాబర్ ఆజమ్ (45), సాద్ బేగ్ (39) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఆ తర్వాత మిడిలార్డర్‌లో సల్మాన్ ఆఘా బాధ్యతాయుతంగా ఆడుతూ అద్భుతమైన శతకం నమోదు చేశాడు. 90 బంతుల్లో 107 పరుగుల చేసి జట్టు స్కోరు 300 పరుగుల మార్కు దాటడంలో కీలకపాత్ర పోషించాడు. హసన్ నవాజ్ కూడా సహకరించడంతో పాక్ కోలుకుంది. చివర్లో వరుసగా వికెట్లు కోల్పోయిన పాక్.. మరో



బంతి మిగిలి ఉండగానే 305 పరుగులకు ఆలౌట్ అయింది. లంక బౌలర్లలో ఇషాన్ మలింగ 4 వికెట్లు తీసి పాక్ ఇన్నింగ్స్‌ను దెబ్బతీశాడు. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన శ్రీలంక జట్టు ఆరంభంలోనే తడబడింది. అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్ తక్కువ పరుగులకే వెనుదిరిగారు. 91 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో పవన్ రత్నాయకే (79), జనిత్ లియనేగే (60) అద్భుతమైన భాగస్వామ్యంతో శ్రీలంకను రేసులోకి తెచ్చారు. వీరిద్దరూ అర్ధశతకాలతో మెరిసి పాక్ శిబిరంలో టెన్షన్ పుట్టించారు. అయితే కీలక సమయాల్లో పాక్ బౌలర్లు పుంజుకున్నారు. రత్నాయకే, లియనేగేలను ఔట్ చేసి మ్యాచ్‌ను తమ వైపు తిప్పుకున్నారు. ఆ తర్వాత వచ్చిన దాసన్ శనక (18 బంతుల్లో 28 రన్స్) దూకుడుగా ఆడినప్పటికీ, కెప్టెన్ షాహీన్ అఫ్రిది అతడిని బోల్తా కొట్టించాడు. శనక అవుట్ కావడంతో లంక లోయర్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది.షాహీన్ అఫ్రిది 3 వికెట్లు తీయగా, నసీమ్ షా, హరీస్ రౌఫ్ రాణించడంతో శ్రీలంక జట్టు 48.1 ఓవర్లలో 268 పరుగులకే కుప్పకూలింది. దీంతో 37 రన్స్ తేడాతో పాక్ విజయం సాధించింది. పాక్, శ్రీలంక, ఇంగ్లాండ్ మధ్య ఈ ట్రై సిరీస్ జరుగుతోంది. కాగా ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ మధ్యలోనే సల్మాన్ అలీ అఘాను సెలక్టర్లు ఇంటికి పంపించారు. కానీ ఇప్పుడేమో అతడు సెంచరీతో జట్టును గెలిపించాడు

## పారా షూటింగ్‌లో భారత్ సత్తా.

- -మోనాకు స్వర్ణం, అవనికి రజతం!
- -ఏషియన్ పారా గేమ్స్‌లో భారత షూటర్లకు డబుల్ ధమాకా
- -మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో పతకాల పంట
- -250 పాయింట్లతో మోనా అగర్వాల్‌కు బంగారు పతకం
- -249.6 స్కోరుతో అవని లేఖరాకు రజతం
- -స్వర్ణం కోసం ఇద్దరి మధ్య హోరాహోరీ పోరు
- -ఒకే ఈవెంట్‌లో టాప్ రెండు పతకాలు భారత్‌కే
- -పారా ఆర్చరీలో శీతల్ దేవి ప్రపంచ రికార్డు
- -జూడోలో కోకిల పతకంపై ఆశలు



నగోయా:
ఏషియన్ పారా గేమ్స్‌లో భారత క్రీడాకారిణులు సత్తా చాటారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో పారా షూటర్లు మోనా అగర్వాల్, అవని లేఖరా స్వర్ణ, రజత పతకాలు సాధించారు. ఒకే ఈవెంట్‌లో తొలి రెండు పతకాలను భారత అథ్లెట్లు కైవసం చేసుకోవడం విశేషంగా నిలిచింది. ఫైనల్లో మోనా అగర్వాల్ 250 పాయింట్లు సాధించి స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నారు. అవని లేఖరా 249.6 పాయింట్లతో గట్టి పోటీ ఇచ్చి రజత పతకాన్ని గెలుచుకున్నారు. ఇద్దరి మధ్య చివరి వరకు ఉత్కంఠభరిత పోరు సాగింది. మరోవైపు పారా ఆర్చరీలో భారత క్రీడాకారిణి శీతల్ దేవి ప్రపంచ రికార్డు సృష్టించినట్లు సమాచారం. దీంతో భారత పతకాల ఖాతాకు మరో ఘనత చేరింది. జూడో మహిళల 52 కేజీల విభాగంలో కోకిల పతకం సాధించే అవకాశాలున్నాయి. ఆమె ప్రదర్శనపై భారత క్రీడాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# నాని బ్లడీ రోమియో షూటింగ్ షురూ..

## -ఇంతకీ లొకేషన్ ఎక్కడో తెలుసా..?




రీసెంట్‌గా శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో ప్యారడైజ్ మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు నాని. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. అక్టోబర్ 22న నెట్‌ఫ్లిక్స్‌లో కూడా సందడి చేయబోతుంది. కాగా ఇక తన నెక్స్ట్ మూవీ బ్లడీ రోమియో పై ఫోకస్ షిఫ్ట్ చేశాడు నాని. అభిమానులు, మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న షూటింగ్ టైం రానే వచ్చింది. ఫిలింనగర్ సర్కిల్ సమాచారం ప్రకారం దేశరాజధాని నగరం ఢిల్లీలో బ్లడీ రోమియో షూటింగ్ మొదలైంది. ఢిల్లీలో వారంపాటు ఈ తొలి షెడ్యూల్ కొనసాగనుందట. ఢిల్లీ షూటింగ్ తర్వాత నాని టీం నెక్స్ట్ షెడ్యూల్ కోసం హైదరాబాద్‌కు పయనం కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇదిలా ఉంటే ఇంతకీ నానితో రొమాన్స్ చేయబోయే భామ ఎవరనేది ఇంకా సస్పెన్స్‌లోనె పెట్టేశారు మేకర్స్.. నిహారికా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తున్నాడు. మేకర్స్ ఈ మూవీని 2027 వేసవి కానుకగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. నాని ఈ సారి సూపర్ స్టైలిష్‌గా కనిపించబోతున్నట్టు బ్లడీ రోమియో టీం ఇటీవలే రిలీజ్ చేసిన వీడియో ద్వారా క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. నాని ఇందులో గ్యాంగ్‌స్టర్ నుంచి చెఫ్‌గా మారిన వ్యక్తిగా కనిపించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. స్టైలిష్ హెయిర్ అండ్ బ్లాక్ గూగుల్స్ లో మేకోవర్ అయిన నాని లుక్‌తోపాటు సుజీత్ టీం ఫుడ్ ట్రక్‌పై.. దీశ్రీశీశీఎవ =శీఎవశీ..ఎస్ట్రవ ఖఙ్ఎష్ట్రవఅ రాజూవఅ రాశీశీఅ అని రాసిన వీడియోను షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది.

# 'జైలర్ 2' బాక్సాఫీస్ సునామీ..

## -మూడు రోజుల్లోనే రూ.317 కోట్లకు పైగా వసూళ్లు!




సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' థియేటర్లలో భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటూ బాక్సాఫీస్ వద్ద రికార్డుల దిశగా సాగుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.317.15 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది.ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'జైలర్ 2' తొలి వారాంతంలోనే భారీ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ లెక్కలు చెబుతున్నాయి.ముఖ్యంగా తమిళనాడులో రజనీకాంత్‌కు ఉన్న క్రేజ్ ఈ సినిమాకు పెద్ద బలంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లోనూ సినిమాకు మంచి స్పందన లభిస్తుండటంతో పలు ప్రాంతాల్లో థియేటర్లు ప్రేక్షకులతో సందడిగా కనిపిస్తున్నాయి. అందుబాటులో ఉన్న వసూళ్ల అంచనాల ప్రకారం, మూడు రోజుల్లో భారతదేశంలో రూ.169.65 కోట్ల గ్రాస్, రూ.144.60 కోట్ల నెట్ వసూళ్లు నమోదయ్యాయి. విదేశీ మార్కెట్లలోనూ సినిమా మంచి ప్రదర్శన కనబరుస్తుండటంతో ప్రపంచవ్యాప్త వసూళ్లు రూ.317.15 కోట్లకు చేరినట్లు సమాచారం. శనివారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 14,604 షోల ద్వారా 'జైలర్ 2' రూ.47.8 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రాంతాలవారీగా వసూళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు 7,802 షోల ద్వారా రూ.34.6 కోట్ల నెట్ వసూళ్లు, తెలుగు రాష్ట్రాలు 2,100 షోల ద్వారా రూ.8.50 కోట్ల నెట్ వసూళ్లు, ఉత్తర భారతదేశంలో 4,554 షోల ద్వారా రూ.4.25 కోట్ల నెట్ వసూళ్లు, కర్ణాటకలో కన్నడ వెర్షన్ ద్వారా 148 షోలతో రూ.45 లక్షల నెట్ వసూళ్లు సాధించినట్టు తెలుస్తుంది. ఈ లెక్కలను బట్టి తమిళనాడులో సినిమా ప్రభావం ఎంత బలంగా ఉందో అర్థమవుతోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ గణనీయమైన వసూళ్లు నమోదవడం చిత్ర బృందానికి ఊరటనిచ్చే అంశం. భారతదేశంతో పాటు విదేశీ మార్కెట్లలోనూ 'జైలర్ 2' మంచి వసూళ్లు సాధిస్తున్నట్లు సమాచారం. అమెరికా, బ్రిటన్, గల్ఫ్ దేశాలు, ఆస్ట్రేలియా, మలేషియా వంటి ప్రాంతాల్లో సినిమాకు ఆదరణ లభిస్తోంది. మూడో రోజు ఒక్కరోజే విదేశాల్లో రూ.47.5 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు ట్రేడ్ నివేదికలు పేర్కొంటున్నాయి.దీంతో ఇప్పటివరకు ఓవర్సీస్ మార్కెట్‌లో మొత్తం గ్రాస్ వసూళ్లు రూ.147.50 కోట్లకు చేరినట్లు అంచనా. భారతదేశంలో రూ.169.65 కోట్ల గ్రాస్ వసూళ్లు కలిపితే ప్రపంచవ్యాప్తంగా మొత్తం రూ.317.15 కోట్ల గ్రాస్ నమోదైనట్లు సమాచారం.



## తస్సాదియ్యా అనుపమ చీరలో అదిరిందమ్మా.. కొత్త ఫొటోలు

# హానెస్ట్‌గా తీసిన గ్లోబల్ సినిమా 'కల్ట్'



'మొదటి అయిదు నిమిషాలకే ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా ఇది. ఇదో గ్లోబల్ కంటెంట్. అందుకే ఈ సినిమాను జపనీస్,స్పానిష్ భాషల్లో కూడా డబ్ చేశాం. ఇది భాషను దాటి వెళ్లే సినిమా. రెండు గంటల 20 నిమిషాల పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. యాక్షన్ కంటే ఆడియన్స్ డ్రామాకు కనెక్టవుతారు. నేను ఎక్స్‌పెరిమెంట్ చేసిన ప్రతిసారీ ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. ఇందులో ఎలాంటి ఈక్వేషన్స్, క్యాలిక్యులేషన్స్ ఉండవు. చాలా హానెస్ట్‌గా ఈసినిమా చేశాం.ఇందులో 150మంది ప్రొఫెషనల్ యాక్టర్స్ ఉన్నారు. వారంతా కేవలం నా కోసం ఈ సినిమాలో భాగమయ్యారు. నటుడిగానే కాక, దర్శకునిగా కూడా నాకు సంతృప్తిని ఇచ్చిన సినిమా 'కల్ట్'' అని విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కల్ట్'. సందీప్ కాకరాల నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడారు. ఇంకా నిర్మాత సందీప్ కాకరాల, యాక్టర్ ఈజీ, అనిరుధ్, కార్తికేయ, తారక్ పొన్నప్ప కూడా మాట్లాడారు. గోవాలోని ఒక నిర్మానుష్య ఐలాండ్ ఎస్టేట్‌లో 300మందికి పైగా చిక్కుకుపోవడంతో ట్రైలర్ మొదలైంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా ట్రైలర్ సాగింది. ట్రైలర్‌లో విశ్వక్ పాత్ర విభిన్న కోణాల్లో కనిపించింది. వాస్తవంగా జరిగిన భయానక సంఘటనల స్ఫూర్తితో రూపొందిన తొలి ఇండియన్ స్లాషర్ థ్రిల్లర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు.

# వచ్చే ఏడాది దీపావళికి 'స్పిరిట్'



పాన్ ఇండియా ప్రేక్షకులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'స్పిరిట్' ముందు వరుసలో ఉంటుంది. సాధారణంగా సందీప్‌రెడ్డి వంగా సినిమాల్లో హీరోలు విచిత్రమైన యాటిట్యూడ్‌తో కనిపిస్తుంటారు. 'అర్జున్‌రెడ్డి'లో విజయ్ దేవరకొండ, 'కబీర్‌సింగ్'లో షాహిద్‌కపూర్, 'యానిమల్'లో రణబీర్‌కపూర్ పాత్రలే అందుకు నిదర్శనాలు. ప్రస్తుతం తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' సినిమాలో పాన్ ఇండియా సూపర్‌స్టార్ అయిన ప్రభాస్‌ని సందీప్ ఎలా చూపించబోతున్నాడు?.. అనే ఊహే ప్రేక్షకులను రోమాంచితులను చేస్తున్నది. అందుతున్న సమాచారం ప్రకారం ఇందులో ప్రభాస్ పాత్ర.. విభిన్నంగా, విచిత్రంగా, మాస్ ప్రేక్షకులు మురిసిపోయేలా, సగటు ప్రేక్షకుడు సంబరపడిపోయేలా, యువతరం ఉర్రూతలూగేలా ఉంటుందట. భద్రకాళి పిక్చర్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా వచ్చే ఏడాది అక్టోబర్ 29న దీపావళి కానుకగా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇంటెన్స్,స్టైలిష్, మిస్టీరియస్ అవతారంలో ఉన్న ప్రభాస్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. బ్లాక్ క్యాప్, డార్క్ సన్ గ్లాసెస్, గడ్డంతో, రఫ్ అండ్ టఫ్‌గా క్లోజప్ ప్రొఫైల్ షాట్‌లో ప్రభాస్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. పవర్‌ఫుల్ కథతో, క్రేజీ కాంబినేషన్‌లో రానున్న ఈ చిత్రంలో త్రిప్తి డిమ్రీ కథానాయిక. వివేక్ ఒబెరాయ్ కీలకపాత్రధారి. ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్‌కుమార్ నిర్మాతలు.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831